శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, జూన్ 23, పభాతవార్త** : మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం సాయంత్రానికి 486క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 34.860టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 700, ఎన్ఎఫ్‌సికి 425, పెన్నా డెల్టాకు 3300కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 92.903మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# పోలీస్ అధికారులకు బాధితుల మొర



**నెల్లూరు క్రైమ్, జూన్ 23, ప్రభాతవార్త :** జిల్లా యస్.పి జి.కృష్ణ కాంత్ ఆదేశాల మేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం సోమవారం స్థానిక ఉమేష్ చంద్ర సమావేశం మందిరంలో జరిగింది. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో మాట్లాడిన జిల్లాస్థాయి పోలీస్ అధికారులు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 96 ఫిర్యాదులు అందినట్లు పోలీసు అధికారులు తెలిపారు. వేదాయపాలెం పరిధికి చెందినటువంటి రెండు కుటుంబ సభ్యులను, నెల్లూరు టౌన్‌కి చెందిన పద్మయ్య, కిరణ్ కుమార్ అనే పరిచయస్తుల ద్వారా తిరుచ్చికి చెందిన సాలా ఉద్దీన్, నెల్లూరుకి చెందిన శివకుమార్ అనే ఏజెంట్లు ద్వారా, నెల్లూరులోని బ్యాంకులలో ఉన్న మీ నగలను విడిపించి, తిరుచ్చిలోని రీబిబి ఇన్వెస్ట్మెంట్ అనే సంస్థలో పెట్టి, ఎటువంటి వడ్డీ లేకుండా, మీ అసలు నగదు తెచ్చిన వెంటనే మీ నగలను ఇస్తామని నమ్మించి, ఒకరి వద్ద 30 సవర్లు, మరొకరు వద్ద 35 సవరలు తీసుకొని, ప్రస్తుతం నగదు కడతామని చెప్పినా నగలు తిరిగి ఇవ్వడం లేదని, మోసపోయామని, విచారించి న్యాయం చేయాలని కోరారు. నెల్లూరు రూరల్ పరిధికి చెందిన మహిళను అదే ప్రాంతానికి చెందిన ముత్యాల శివ అనే వ్యక్తి తన శారీరకవాంచ తీర్చమని మానసికంగా వేధిస్తున్నాడని లేదంటే సోషల్ మీడియాలో తన గురించి అసభ్యంగా పెడతానని బెదిరిస్తున్నాడని విచారించి న్యాయం చేయాలని కోరారు. బుచ్చి పరిధికి చెందినటువంటి వ్యక్తి, తన భార్య జనవరి నుండి కనిపించడం లేదని, బుచ్చి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు, ఆచూకీ కనుగొని అప్పగించాలని కోరారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్. సౌజన్య, టౌన్ డిఎస్పిసింధుప్రియ, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పి చెంచు రామారావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి , ఎస్‌బి 2 సిఐ శ్రీనివాసరెడ్డి, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సుపరిపాలన స్వర్ణాంధ్రప్రదేశ్ సమావేశంలో వేమిరెడ్డి దంపతులు



**నెల్లూరు రూరల్, జూన్ 23, ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పాలన పూర్తయిన నేపథ్యంలో అమరావతిలో సోమవారం ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి సమక్షంలో జరిగిన సుపరిపాలన స్వర్ణాంధ్రప్రదేశ్ సమావేశంలో నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్ర మాలపై ముఖ్యమంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.



అలాగే రాబోయే కాలంలో చేపట్టాల్సిన అంశా లను వివరించారు.

ఎంపీలకు, ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు వివిధ అంశాలపై దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో పాల్గొన్న వేమిరెడ్డి దంపతులు ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్‌తో ప్రత్యేకంగా మాట్లాడారు. పలు అంశాలను ఆయనతో చర్చించారు.

# ప్రజలు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలి

**- జాయింట్ కలెక్టర్ కార్తీక్ - ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 399 అర్జీలు**



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 23, ప్రభాతవార్త** ప్రజలు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జాయింట్ కలెక్టర్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జేసీతో పాటు డిఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, సర్వేరికార్డుల ఎడి నాగశేఖర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. ప్రతి అర్జీని కూడా క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపించాలని, పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు వివరించాలన్నారు.

**పేదల భూములను ఆక్రమించిన రిటైర్డ్ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలి** నగరంలోని వేదాయపాలెం చంద్రమౌళి నగర్లో సర్వేనెంబరు 78/2లో గతంలో పేదలకు ఇచ్చిన ప్రభుత్వ భూమిని రిటైర్డ్ ఉద్యోగి పోగుల విజయసేన్ కుమార్ నకిలీ డాక్యుమెంట్లతో ఆక్రమించి బిల్డింగ్ నిర్మించి అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారని, వెంటనే ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని చేకూరి సురేష్ అనే అర్జీదారుడు పిజిఆర్ఎస్‌లో అర్జీ అందించారు. అనేకసార్లు ఈ రిటైర్డ్ ఉద్యోగి ఆక్రమణలపై నెల్లూరు రూరల్ మండల తహశీల్దారు కార్యాలయ అధికారులకు ఫిర్యాదు చేసిననూ పట్టించుకోవడం లేదని, వెంటనే అధికారులు స్పందించి కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని అర్జీని అందించారు.

**విద్యాహక్కు చట్టం ద్వారా పాఠశాలలో సీటు ఇప్పించండి** విద్యాహక్కు చట్టం ఆర్‌టిఈ యాక్ట్ ప్రకారం తమ కుమార్తె గోనుగుంట దేవిక 1వ తరగతిలో ఉచితంగా ప్రవేశం పొందేందుకు సెలెక్ట్ అయినట్లు, శ్రీ చైతన్య ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో సంప్రదించాలని ఫోన్‌కు మెసెజ్ వచ్చిందని, అయితే ఆ పాఠశాల వారు తమ పాపను చేర్చుకోకుండా, ఫీజులు కట్టి చేరాలని ఇబ్బందులు పెడుతున్నారని పి.భవాని అనే మహిళ పిజిఆర్ఎస్‌లో అర్జీ అందజేసింది. ఈ విషయమై అధికారులు చైతన్య పాఠశాల వారితో మాట్లాడి



తమ పాపకు ఆర్‌టిఈ యాక్ట్ ప్రకారం అడ్మిషన్ ఇప్పించాలని ఆమె విన్నవించారు.

**ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 399 అర్జీలు** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 399 అర్జీలను ప్రజలు అందజేశారు. వీటిలో ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబంధించి 142, మున్సిపల్‌శాఖకు సంబంధించి 39, సర్వేకు 44, పంచాయతీ రాజ్ శాఖకు 32, పోలీసుశాఖకు 39 అర్జీలు అందాయి. ఈ అర్జీలపై సానుకూలంగా స్పందించిన జాయింట్ కలెక్టర్ నిర్దిష్ట గడువులోగా అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పలువురు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# డ్వామాలో సిబ్బంది పని చేయకున్నా జీతాలు

**- ఐదేళ్లు దాటిన లిస్ట్ లో చూపని వైనం - హెచ్ ఆర్, ఫైనాన్సు సెక్షన్ వారిదే హవా.. - అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు - పిడి గంగాభవాని**

**నెల్లూరు కలెక్టరేట్ జూన్ 23 ప్రభాతవార్త** డ్వామాలో సిబ్బంది బదిలీలు లోనే కాదు జీతం ఇవ్వడం లో కూడా హెచ్ ఆర్ ఆనంద్ మార్క్ కనపడుతుంది. కలువాయి మండలం లో ఉదయ్ అనే కంప్యూటర్ ఆపరేటర్ పనిచేస్తున్నట్లు ప్రతి నెల కలువాయి ఎం పి డి ఓ డ్యూటీ సర్టిఫికేట్ లేకుండానే, కలువాయి మండలంలో పని చేస్తున్నట్లు చూపి 17 వేలు ప్రతి నెల ఇస్తున్నారు. అలాగే కలిగిరిలో జ్యోతి కంప్యూటర్ ఆపరేటర్ పనిచేస్తున్నట్లు చూపి డ్వామా లో సంవత్సరాల తరబడి పని చేయించుకుంటున్నారు.అయితే ఒక స్పెషల్ ఉంది హెచ్ ఆర్ నే స్వయంగా ఔట్ సోర్సింగ్ ద్వారా డ్యూటీ సర్టిఫికేట్ లు పరిశీలించి,ఫైనాన్సియల్ సెక్షన్ అధికారితో టై అయ్యి అందరి కంప్యూటర్ ఆపరేటర్ లకి 17153 జీతం వస్తే ఒక్క జ్యోతి అనే కంప్యూటర్ ఆపరేటర్ కి 18500 జీతం వస్తుంది.ఎందుకు వస్తుంది అని తోటి కంప్యూర్ ఆపరేటర్ లు హెచ్ ఆర్ నీ ప్రశ్నిస్తే వారినీ ఏదో విధంగా ఇబ్బంది పెడుతున్నట్లు తెలుపుతున్నారు .ఇంకో సంఘటన మనుభోలు మండలం ఏ పి ఓ రాజమ్మ నవంబర్ 2024 నెలలో తన భర్తకి ఆక్సిడెంట్ అయ్యి సెలవు పై వెళితే అక్కడి ఎంపిడిఓ సైతం క్యాజువల్ లీవ్ అని అటెండెన్స్ రిజిస్టర్ లో కూడా రాస్తే డ్వామా హెచ్ ఆర్ ఆనంద్ పూర్తి జీతం పెట్టేశాడు.సోషల్ ఆడిట్ అకౌంట్ బులిటి మరియు హెచ్ ఆర్ గా ఆరు సంవత్సరాలు పైగా




పనిచేస్తున్న ఐదు సంవత్సరాలు పని చేసిన వారిని బదిలీ చేయాలి అని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చి ఉన్న కనీసం పాటించకుండా ఉన్నారు అంటే డ్వామా లో ఏం జరుగుతుందో అర్థం అవుతుంది.అదే సెక్షన్ లో పని చేస్తున్న శారద అనే కంప్యూటర్ ఆపరేటర్ కూడా ఐదు సంవత్సరాల పైబడిన జాబితాలో చూపక పోవడం కూడా అంతుబట్టడం లేదు అని ఉపాధి ఉద్యోగులు సైతం వాపోతున్నారు. క్లస్టర్ స్థాయి ఏపీడీలకు సైతం తెలియకుండానే బదిలీలు జరిగిపోతున్నాయి. ఉదయగిరి మండలంలో క్రిమినల్ కేసు నమోదు అయినటువంటి వారికి అతి తొందరగా పోస్టింగ్ ఇవ్వడం వెనుక హెచ్ఆర్ హస్తం ఏ విధంగా పనిచేస్తుందో అర్థం చేసుకోవచ్చు. డ్వామా పీడీ కి తెలియకుండా కిందిస్థాయి ఏవో తో సంతకం చేయించి హెచ్ఆర్ ఆనంద్ తన సెక్షన్ ద్వారా అన్ని తానే విధులు నిర్వహించుకుంటూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడు. క్లస్టర్ ఏపీడీలు కూడా ఈ విషయం పట్ల ఆశ్చర్యానికి గురవుతున్నారు. డ్వామా కార్యాలయంలో జరుగుతున్న బదిలీలు, జీతాలు మరియు సోషల్ ఆడిట్ రికవరీల విషయంలో పూర్తిస్థాయి విచారణ చేపడితే మరిన్ని విషయాలు బయటకు వస్తాయని ఉపాధి ఉద్యోగులు తెలియజేస్తున్నారు.నీరజ అనే కంప్యూటర్ ఆపరేటర్ నీ ఇటీవల అల్లూరు నుంచి డ్వామా కి బదిలీ చేసి,మరల డ్వామా నుంచి సంగం కు బదిలీ మరల సంగం నుంచి డ్వామా కు,మళ్ళీ వెంటనే తోట పల్లి గూడూరుకు బదిలీలతో వే ధిస్తున్నట్లు తెలిసింది. ఫైనాన్స్ సెక్షన్‌లో ఉన్న అధికారి డ్వామా లో అన్ని తానే అయ్యి హెచ్ ఆర్ సెక్షన్‌తో కలసి వారికి ఇష్టం వచ్చిన వారికి పోస్టింగ్ ఎక్కడ కావాలంటే అక్కడికి మారుస్తూ, వేధిస్తూ ఉన్నారు. జిల్లా కలెక్టర్ డ్వామా పై దృష్టి సారిస్తే మరిన్ని విషయాలు బయటకు పడతాయని వామ ఉద్యోగులు తెలుపుతున్నారు. డ్వామా పీడీ గంగాభవని మాట్లాడుతూ అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఈ విషయంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ద్వమా పిడి గంగాభవాని తెలిపారు.

## ఎంపి గారు శ్మశానానికి ప్రహారి గోడ నిర్మించండి
## రెండు నియోజకవర్గాలకు సంబందించినది



**బుచ్చి జూన్ 23 ప్రభాతవార్త** శ్మశానం మాత్రం బుచ్చిరెడ్డిపాళెం రాఘవరెడ్డి నగర ప్రజలు వాడుకుంటారు. కాని శ్మశానం ఉండేది సంగం మండలం పొలాలలో రోడ్డుపక్కనే ఉంది. శ్మశానంలో మృతదేహాన్ని దహనం చేస్తే రోడ్డు పక్కన వేళ్ళేవారు.మహిళలు, చిన్నపిల్లలు భయాందోళనకు గురౌతున్నారు.ఈ శ్మశానానికి ప్రహరి చాలా అవసరమని బుచ్చి ప్రజలు గతంలో అనేక మంది నాయకులకు మొర పెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్ళి శ్మశానానికి ప్రహారి గోడ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఎంపిగారు ఈవిషయంలో పూర్తి స్దాయిలో సహాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రభుత్వానికి వ్యతిరేకంగా యువత పోరు

**- వైఎస్ఆర్సిపి యువజన విభాగం ఆధ్వర్యంలో జరిగిన యువత పోరు భారీగా తరలివచ్చిన యువత**
**- జెండా ఊపి యువత పోరు కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి**



**నెల్లూరు రూరల్, జూన్ 23, ప్రభాతవార్త** యువత సమస్యల పై వినూత్న రీతిలో రిక్షా తొక్కుతూ నిరసన తెలియజేసిన యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఊటుకూరు నాగార్జున నెల్లూరు ఓల్డ్ జడ్పీ ఆఫీస్ నుంచి కలెక్టరేట్ వరకు యువతకు ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను ఎండగడుతూ సాగిన ర్యాలీ యువత పోరు విజయవంతం కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్న యువత నెల్లూరు వైఎస్సార్సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున ఆధ్వర్యంలో నిర్వహించిన యువత పోరు కార్యక్రమానికి 1500 మందికి పైగా యువత భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హాజరై యువజన పోరు ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ప్రభుత్వం యువతకు చేస్తున్న అన్యాయాలను నినదీస్తూ యువత ప్లకార్డులు చేత పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జిల్లా యువజన విభాగం అధ్యక్షులు, ఊటుకూరు నాగార్జున వినూత్న రీతిలో రిక్షా తొక్కుతూ యువత పడుతున్న ఇబ్బందుల పై నిరసన తెలియజేశారు. ఓల్డ్ జడ్పీ కార్యాలయం నుంచి. కలెక్టరేట్ వరకు యువత, నిరుద్యోగుల ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ర్యాలీ హోరెత్తింది. అనంతరం కలెక్టరేట్ వద్దకు చేరుకొని వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు ఆశ్రిత్ రెడ్డి, వైఎస్ఆర్సిపి యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి చీదెళ్ల కిషన్‌లు డిఆర్ఓ భాస్కర్ రావుకి యువత ఎదుర్కొంటున్న సమస్యలపై మెమోరాండం అందజేసి యువత, నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. నిరుద్యోగ భృతి పేరుతో బాబు చంద్రబాబు యువతను దగా చేశారని వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి చీదెళ్ల కిషన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ఆర్సిపి నేతలపై అక్రమ కేసులు పెడుతున్నప్పటికీ చంద్రబాబు చేత తల్లికి వందనం అమలు చేయించిన ఘనత వైఎస్ఆర్సిపి యువజన విభాగానిదేనన్నారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం మెడలు వంచి యువతకు నిరుద్యోగ భృతి కూడా యువతకు అందే విధంగా వైఎస్ఆర్సిపి పోరాటం చేస్తుందని తెలిపారు. ఈరోజు వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు యువత పోరు కార్యక్రమాన్ని జిల్లాలో దిగ్విజయంగా నిర్వహించామని వై సి పి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు ఆశ్రిత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో చదువు పూర్తి చేసుకొన్న విద్యార్థులు కళాశాలల నుంచి.. సర్టిఫికెట్లు తీసుకోలేక.. ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కార్పోరేటర్ ఊటుకూరు నాగార్జున మాట్లాడుతూ ఈరోజు జిల్లాలో వైసిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు నెల్లూరు సిటీ వైసిపి ఇన్చార్జి పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సహకారంతో జిల్లాలో పెద్ద ఎత్తున యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. వైఎస్ఆర్సిపి ఇచ్చిన ఒక పిలుపుతో జిల్లా నలుమూలల నుంచి యువత ఉప్పెనలా యువత పోరు కార్యక్రమానికి తరలి రావడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు యువతను మభ్యపెట్టి ఓట్లు వేయించుకొని ఈ రోజు వారికి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కాలం పూర్తవుతున్నప్పటికీ యువతకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా చంద్రబాబు అమలు చేయలేదని అన్నారు. ఇటీవల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చంద్రబాబు దుర్మార్గపు పాలనపై పుస్తకం విడుదల చేయడం జరిగిందని అదే చంద్రబాబు జీవితంలో ఇప్పటివరకు చేసిన తప్పులను లెక్కిస్తూ పుస్తకాలను రచిస్తే అబద్దాలు చంద్రన్న మోసాల బాబు అని ఊరికో లైబ్రరీ పెట్టాల్సి వస్తుందన్నారు. ఈరోజు చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మి నిలువునా మోసపోయామని ప్రజలు గ్రహించి మళ్ళీ ఈ రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పాలనను తెచ్చుకోవాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన వైఖరి మార్చుకొని యువతకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేదంటే భవిష్యత్తులో వైఎస్ఆర్సిపి మరింత ఉధృతంగా పోరుబాట సాగిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాలికకు అండగా ఎమ్మెల్యే ప్రశాంతమ్మ



**ఇందుకూరుపేట, జూన్ 23, ప్రభాతవార్త** ఇందుకూరుపేట మండలం కుడితిపాలెం కాకర్ల దిబ్బలో జరిగిన ఘటనలో తీవ్రంగా గాయపడిన చెంచమ్మ అనే బాలికకు వేమిరెడ్డి దంపతులు అండగా నిలిచారు. వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలికకు వైద్య సదుపాయలు కల్పిస్తున్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బాలిక పరిస్థితిని తెలుసుకున్న వెంటనే స్థానిక నాయకులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో టీడీపీ నేతలు కోడూరు కమలాకర్‌రెడ్డి, దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పవన్‌రెడ్డి, మైనార్టీ నాయకులు షేక్ ఇంతియాజ్ తదితరులు బాలికను ఇందుకూరుపేట ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అపోలో ఆసుపత్రికి తీసుకువచ్చి వైద్య సేవలు అందిస్తున్నారు. కుడితిపాలెం కాకర్ల దిబ్బలో బాలికపై బంధువులు దారుణంగా దాడి చేసి వాతలు పెట్టగా.. ఈ ఘటనను ఎమ్మెల్యే ప్రశాంతమ్మ తీవ్రంగా పరిగణించారు. దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే బాలిక పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని చెప్పారు. బాలికకు అన్ని విధాలా అండగా ఉంటామని ఆమె వెల్లడించారు.

## చికెన్ వ్యర్ధాల వాహనాలు పట్టుకున్న బుచ్చి పోలీసులు : వాహనాలను సీజ్ చేసి కోర్టుకు పెడతామన్న సిఐ



**బుచ్చి జూన్ 23 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలో చికెన్ వ్యర్ధాల రవాణా జోరుగా సాగుతోంది. సోమవారం తెల్లవారు జామున దామరమడుగు, కాగులపాడు, గ్రామాలల్లో చికెన్ వ్యర్ధాల వాహనాలను ఎస్ఐ సంతోష్‌రెడ్డి స్వాధీనం చేసుకున్నారు. మూడు వాహనాలను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో సిఐ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతు చికెన్ వ్యర్ధాలను ప్రోత్సహిస్తున్న ఆక్వా రైతులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాల డ్రైవర్లు,యాజమాన్యంపై,కేసు నమోదు చేస్తామన్నారు. వాహనాలను సీజ్ చేసి కోర్టుకి పెడతామని అన్నారు. త్వరలో ఆక్వా రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. గుంటలు లీజుకు తీసుకున్న వారిపై బైండవర్ చేసుకుంటామని తెలిపారు. చెక్‌పోస్టు వద్ద నిఘా పెంచమని జిల్లా ఎస్‌పి ఆదేశాలను అక్రమరవాణా ఎక్కడి నుండి జరుగుతుంది ఆప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేయాలని అక్కడ ఎస్ఐలకు ఇప్పిటికే ఆదేశించామన్నారు. మత్యశాఖ,పోలీసు,రెవిన్యూ, అందరు సమన్వయంతో చికెన్ వ్యర్ధాల రవాణానకు అడ్డుకట్ట వేస్తామని తెలిపారు. గుంటల వద్దకు వచ్చి కూడా పరిశీలిస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట ఎస్ఐ సంతోష్‌రెడ్డి ఉన్నారు.



## ఈ శ్రమ రిజిస్ట్రేషన్ చేయండి : మెప్మా పిడి లీలా రాణి



**నెల్లూరు సిటీ, జూన్ 23, ప్రభాతవార్త :** పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న అసంఘటితరంగ కార్మికులైన వారందరికి ఈశ్రం రిజిస్ట్రేషన్ చేయాలనీ. 16 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల లోపు వయసు కలిగినటువంటి పురుషులు, మహిళల కార్మికులను ఈ శ్రమ రిజిస్ట్రేషన్ ద్వారా వారికి గుర్తింపు కార్డులు మంజూరు చేయించాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ బి లీలారాణి అన్నారు. ఈరోజు డీజీ లక్ష్మిలకు ఈ శ్రం రిజిస్ట్రేషన్ పై అవగాహన కార్యక్రమం కల్పించి వారికి బయోమెట్రిక్ మిషన్లను అందజేశారు. ఈ శ్రమ రిజిస్ట్రేషన్ ఎలా చేయాలా ఎవరికి చేయాలా, దానివల్ల ప్రయోజనాలు, వివరించారు. రిజిస్ట్రేషన్ ద్వారా పట్టణంలో నివసిస్తున్న అసంఘటిత కార్మికులను అందరిని ఈ శ్రమ కింద చేర్పించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని అందులో డీజీ లక్ష్మి పాత్ర చాలా కీలకమని తెలియజేశారు. డిజి లక్ష్మిలుగా గుర్తింపబడును వారికి వారి యొక్క విధులు బాధ్యతలను గురించి తెలియజేసి, ఈ శ్రమ అనేటువంటి పథకాన్ని ప్రజల్లోకి తీసుకుపోవటంలో డీజే లక్ష్మిలో కీలకంగా వహిస్తారని ప్రతి పేద మహిళాను రిజిస్టార్ చేయాలన్నారు. కార్మికులు అందరికి కూడా ఈశ్రమం రిజిస్ట్రేషన్ ఉచితంగా చేయవలెనని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐబి అంకయ్య, ఐటి శంకర్ ప్రసాద్, సి ఎం ఎం జరినా పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు మాకు అమలు చేయండి

**- కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీలు డిమాండ్**




**నెల్లూరు కలెక్టరేట్, జున్ 23, ప్రభాతవార్త :** నెల్లూరు కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం జిల్లాలోని అంగనవాడీలు నెల్లూరు కలెక్టరేట్ ఎదుట ఏపీ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ధర్నా నిర్వహించారు. అంగన్వాడీలకు తల్లికి వందనం అమలు చేయాలని తెలియజేస్తూ అంగన్వాడీలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమకు కూడా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలని కలెక్టరేట్ ఎదుట పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు నినాదాలు చేస్తూహోరెత్తారు. యూనియన్ అధ్యక్షురాలు సుజాతమ్మ కార్యదర్శి షైక్ రెహనా బేగం ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సాధికార సర్వేలో అంగన్వాడీలకు ప్రభుత్వ ఉద్యోగాలని తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించి అంగన్వాడీలు జీవనం కొనసాగిస్తున్నారని అంగన్వాడీలకు కూడా ప్రభుత్వ పథకాలు రేషన్ కార్డులు వర్తింపచేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ నిరసనలు మరింత తీవ్రతను చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు అంగన్వాడి వర్కర్లు పాల్గొన్నారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిఆర్ఓ ఉదయభాస్కర్‌కు వినతి పత్రం అందించారు.

## మండల టీడీపీ అధ్యక్షుడుగా మస్తాన్ బాబు, కార్యదర్శిగా కృష్ణయాదవ్



**పొదలకూరు, జూన్ 23, ప్రభాతవార్త :** పొదలకూరు తెలుగుదేశం పార్టీ మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. స్థానిక బోగోలు కృష్ణారెడ్డి కళ్యాణ మండపంలో సోమవారం ఆ పార్టీ సర్వేపల్లి పరిశీలకులు దావా పెంచల రావు, సంస్థాగత ఎన్నికల పరిశీలకులు తూపిలి రాధాకృష్ణా రెడ్డిల అధ్యక్షతన పొదలకూరు మండల తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికలు జరిగాయి. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు, ప్రధాన కార్యదర్శిగా పల్లారపు కృష్ణ యాదవ్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గా బొద్దులూరు మల్లికార్జున్ నాయుడు, మండల తెలుగు యువత అధ్యక్షుడుగా వెన్నపూస రాజశేఖర్ రెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షుడుగా వెంపులూరు రామకృష్ణ గౌడ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడుగా కొంగి వెంకటరమణయ్య, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడుగా తాటి కృష్ణయ్య, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడుగా షేక్ ఖాదర్ బాషా, మండల తెలుగు రైతు అధ్యక్షుడుగా యత్తపు వెంకటరెడ్డి, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలుగా ఆదాల సుగుణమ్మ లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వారు ప్రకటించారు. ఈ సందర్భంగా తిరిగి మండల పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన మస్తాన్ బాబు మాట్లాడుతూ తనపై నమ్మకంతో తిరిగి మూడవసారి మండల బాధ్యతలు అప్పగించిన సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. తాను బాధ్యతయుతంగా పనిచేసి మండలంలో పార్టీ మరింత అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్టీ కష్ట కాలంలో పనిచేసిన ప్రతి ఒక్కరిని గుర్తుపెట్టుకుని న్యాయం చేస్తామని చెప్పారు. గత వైసిపి పాలనలో ప్రభుత్వ అరాచకాలను మొక్కవోని ధైర్యంతో ఎదుర్కొని పార్టీని ముందుకు నడిపించిన కమిటీ నే తిరిగి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంపికైన నూతన కమిటీకి మండల నాయకులు, కార్యకర్తలు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు కలిచేటి శ్రీనివాసులు రెడ్డి, వెంపూరుశ్రీనయ్య పచ్చూరు.దశయ్య, సుధాకర్ రెడ్డి, సనంత్ కూమారు, పచ్చూరు రవి , రావుల బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ డ్రైవ్ లో పాల్గొన్న విద్యుత్ శాఖ డి ఈ బెనర్జీ



**అల్లూరు, జూన్ 23 ప్రభాతవార్త:** అల్లూరు టౌన్ పరిధిలో విద్యుత్ వినియోగదారులు మొండి బకాయలను వసూలు చేసేందుకు ఏర్పాటు చేసిన స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో కావలి డి ఈ బెనర్జీ పాల్గొ న్నా రు. మాట్లాడుతూ మొండి బకాయిలు చెల్లించకుండా ఉండే విద్యుత్ వినియోగదారులు కనెక్షన్లు అల్లూరు టౌన్ పరిధిలో తొలగించే కార్యక్రమం మొదలు పెట్టామని అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందించే సూర్యగర్ స్కీం కింద సోలార్ ప్యానల్ నుంచి వచ్చే సౌర విద్యుత్తును వినియోగదారులు సద్వినియోగం చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లుల భారాన్ని తొలగించుకోవచ్చు అని తెలిపారు ఈ కార్యక్రమంలో ఏడీఈ రవిచంద్ర. అల్లూరు టౌన్ ఏఈ మస్తాన్ షరీఫ్. కావలి. బోగోలు. దగదర్తి ఏఈలు. లైన్ మెన్ లు. విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు

## త్రిబుల్ ఐటిలో సీట్లు సాధించిన చేజర్ల విద్యార్థులు



**చేజర్ల జూన్ 23 ప్రభాతవార్త** చేజర్ల మండలంలో ప్రభుత్వ,ప్రవేటు పాఠశాల విద్యార్థులు సోమవారం విడుదలైన త్రిబుల్ ఐటిలో సీట్లు సాధించారు. లుంబిని పాఠశాల విద్యార్థులు ఇద్దరు ఎంపిక కావడం పట్ల పాఠశాల కరస్పాండెంట్ హర్షం వ్యక్తం చేశారు. షేక్ అఫ్రిన్‌తాజ్ ,మెంటా లహరి అలాగే చేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి షేక్ యస్మిన్,జి. పుష్ప ఎంపికయ్యారు. నాగులు వేల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి వేలూరు సాత్విక ,పిడికిటి వెంకట కావ్య, చీకటి చిన్ని ప్రియ సీట్లు సాధించడం జరిగింది. మామూదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి టి .చందన లక్ష్మీ తూర్పుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ఎం జోష్ణ ,బి.దివ్యశ్రీ ఎంపికయ్యారు. విద్యార్థిని, విద్యార్థులు త్రిబుల్ ఐటీ సీట్లు సాధించడం పట్ల ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తలిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## విద్యార్థులకు యూనిఫాం పంపిణి



**సంగం జూన్ 23 ప్రభాతవార్త** సంగం మండలం తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత బుక్స్, యూనిఫాంనుటిడిపి మండలాధ్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు బాబు ,ప్రధానోపాధ్యాయులతో కలిసివిద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతు విద్యార్థుల చదువుకోసం కూటమి ప్రభుత్వం అనేకకార్యక్రమాలు చేపడుతుందని,ప్రతి ఒక్కరు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అదిరోహించాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గోన్నారు.

## నేటి నుండి 4.30 గంటలకే నెల్లూరుకు బస్సు

**- హర్షం వ్యక్తం చేస్తున్న పొదలకూరు ప్రాంత ప్రజలు**



**పొదలకూరు, జూన్ 23, ప్రభాతవార్త :** ఇక మీదట నెల్లూరు నుంచి పొదలకూరుకు ప్రతిరోజు ఉదయం తెల్లవారు జామున నాలుగున్నర గంటలకు (4.30 గంటలకు) ఆర్టీసీ బస్సు బయలు దేరుతుందని నెల్లూరు 2 డిపో మేనేజర్ మురళీకృష్ణ తెలిపారు. పొదలకూరులోని ఆర్టీసీ బస్టాండ్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొదలకూరులోని రాంనగర్ గేట్ సెంటర్ నుంచి ఉదయం 430 గంటలకు బయలుదేరే ఈ బస్సు స్థానిక పంచాయతీ బస్టాండు, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ వరకు కొనసాగుతుందన్నారు. పొదలకూరు నుంచి ఉదయం పూట నెల్లూరు లోని వైద్యశాలలకు వెళ్లేవారు, వ్యాపారపనుల నిమిత్తం వెళ్లే వారు, దూర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగస్తులు, చెన్నై ప్రాంతాలకు వెళ్లాలనుకునే ప్రయాణికులు వారి సమయానుకూలంగా ఈ బస్సు సర్వీసు ఉంటుందన్నారు. చెన్నై వెళ్లే వారికి ముఖ్యంగా రైలు అందుకునేందుకు ఈ బస్సు ఎంతో సౌలభ్యంగా ఉంటుందన్నారు. నెల్లూరుకు వివిధ పనులపై వెళ్లే వారికి అనుకూలంగా ఉండేలా ఈ బస్సు సర్వీసు ఆర్టీసీ డిపో మీదుగా కూరగాయల మార్కెట్, జుళిది, ట్రంక్ రోడ్, కనకమహల్ మీదుగా ఆత్మకూరు బస్టాండ్ వరకు వెళుతుందన్నారు. దీంతో పూలు మరియు కూరగాయల వ్యాపారస్తులు, రైల్వే స్టేషన్, నవాబుపేట వరకు వెళ్లేవారికి ఈ సర్వీసు ఎంతగానో సౌకర్యవంతంగా ఉంటుందని చెప్పారు. అందువల్ల పొదలకూరు నుంచి తెల్లవారుజామున నెల్లూరుకు వెళ్లే ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించకుండా తక్కువ డబ్బుతో సురక్షితంగా ఈ సర్వీస్ ద్వారా నెల్లూరుకు చేరవచ్చన్నారు. పొదలకూరు ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా ఇటీవల పొదలకూరు ఆర్టీసీ బస్టాండ్ పరిశీలనకు విచ్చేసిన నెల్లూరు జోనల్ ఛైర్మన్ సురేష్ రెడ్డిని కలిసిన స్థానికులు పొదలకూరు నుంచి నెల్లూరుకు తెల్లవారుజామున బస్సు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేసిన సురేష్ రెడ్డికి ఈ సందర్భంగా పొదలకూరు బీజేపీ నాయకులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు మండల బిజెపి అధ్యక్షులు పూల ప్రశాంత్, ఉపాధ్యక్షులు చొప్పా వెంకటేశ్వర్లు, ఆ పార్టీ సీనియర్ నాయకులు చింతగింజల సుబ్రహ్మణ్యం, రాచపూటి ధనుంజయ రావు, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రెండు కొత్త ఆర్టీసీ బస్సులు ప్రారంభించిన ఎమ్మెల్యే



**కందుకూరు, జూన్ 23, ప్రభాతవార్త :** ప్రజలకు రవాణా సౌకర్యాలను మరింతగా మెరుగుపరిచే ఉద్దేశంతో రెండు కొత్త ఆర్టీసీ బస్సు సర్వీసులను సోమవారం కందుకూరు ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ 2004లో గుడ్లూరు మండలం అమ్మవారిపాలెం గ్రామానికి ఆర్టీసీ బస్సు సేవలు నిలిచి తర్వాత ప్రజలు ప్రయాణానికి ఆటోలను మాత్రమే ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది పలు గ్రామాల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగించిందని ఎమ్మెల్యే అన్నారు. అలాగే జిల్లా కేంద్రమైన నెల్లూరుకు బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎమ్మెల్యే ప్రజల అవసరాలు, కష్టాలు గమనించి బస్సు సేవలను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని, ఈ కొత్త సర్వీసుల ద్వారా విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు, రైతులు బస్సు ప్రయాణం వారి రాకపోకలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ బస్సు సౌకర్యం ముఖ్యంగా అమ్మవారిపాలెం, అడవిరాజుపాలెం గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఆర్.శ్రీనివాసులు, పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, పిడికిటి వెంకటేశ్వర్లు, చదలవాద కొండయ్య, కూనం నరేంద్ర, ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఉన్నం వీరాస్వామి, గోచిపాతల మోషే, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్, షేక్ రఫీ, వడ్డెళ్ళ రవిచంద్ర, రెబ్బవరపు మాల్యాద్రి, రాయపాటి శ్రీనివాసరావు, మహర్షి శ్రీను, మంచిరాజు మురళీమోహన్, పొడపాటి మహేష్, అత్తంటి శ్రీహరి నాయుడు, మేడ మల్లిఖార్జున, మేకల మాల్యాద్రి, మద్దసాని కృష్ణ, సవిడిబోయిన కృష్ణ, ముప్పవరపు వేణు, కొత్తూరి సుధాకర్, గుర్రం అల్లూరయ్య, జియావుద్దీన్, గుమ్మ శివ, ముప్పవరపు వేణు, తెలుగు ట్రేడ్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం



**లింగసముద్రం, జూన్ 23, ప్రభాతవార్త :** మండలంలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ ఫిరోజ్ తెలిపారు. లింగసముద్రం, మొగిలిచర్ల, చినపవని సబ్ స్టేషన్ల సాధారణ నిర్వహణలో భాగంగా మధ్యాహ్నం 2 గంటలు నుంచి సాయంత్రం 5.30వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## గ్రామ సర్వేయర్ల సమస్యలను పరిష్కరించండి



**తోటపల్లిగూడూరు, జూన్ 23, ప్రభాతవార్త :** తోటపల్లిగూడూరు మండలంలోని సచివాలయాలలో గ్రామ సర్వేయర్లుగా పని చేస్తున్న వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం తోటపల్లిగూడూరు తహాశీల్దార్ బూదూరు పద్మావతికి వినతిపత్రం ఇచ్చి వారి సమస్యలను ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా సర్వేయర్లు మాట్లాడుతూ రీసర్వే చేస్తున్న సర్వే ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు ఎన్నో ఉన్నాయని వాటిని తక్షణం పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సర్వేయర్లు డిమాండ్ చేస్తున్నారు. భూ సర్వేలు అయినా మాకు జనాభా ప్రాతిపదికన కాకుండా రెవెన్యూ విలేజ్ విస్తీర్ణం మేరకు హేతుబద్ధీకరణ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. జీవో నెంబరు నాలుగు ప్రకారం హేతుబద్ధీకరణ చేస్తున్న సర్వేయర్లను వారి సమ్మతితో కౌన్సిలింగ్ ద్వారా పక్రియ చేసి మహిళా ఉద్యోగులు ఇతర డిపార్టుమెంట్లకు వివిధ స్థానాలకు పంపదలుచుకుంటే ఉద్యోగుల సమ్మతి మేరకు జరగాలని సర్వేయర్లు డిమాండ్ చేస్తున్నారు. అలాగే కష్టపడుతున్న తమకు స్పెషల్ అలవెన్సులు కల్పిస్తూ ఒకే డిపార్టుమెంట్ సర్వీస్ రూల్స్ ఇస్తూ వారికి పదోన్నతులు కల్పించాలని వారు కోరుతున్నారు. అలాగే ట్రాన్స్‌ఫర్ చేయాలనుకుంటే ప్రమోషన్స్ ఇచ్చి ట్రాన్స్‌ఫర్ చేయాలని వారు కోరుతున్నారు. ఇలా ఎన్నో సమస్యలు తమకు ఉన్నాయని ఈ సమస్యలన్నింటికి పరిష్కారం చూపేంతవరకు సామరస్యంగా నిరసన తెలుపుతూ ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని సర్వేయర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని గ్రామ సర్వేయర్లందరూ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో పారిశుద్ధ్య చర్యలు



**కొడవలూరు, జూన్ 23, ప్రభాతవార్త :** కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతమ్మ చొరవతో కొడవ లూరు మండలం మానేగుంటపాడు ఎస్టి కాలనీలో అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టారు. మానేగుంటపాడు ఎస్టీ కాలనీలో అపరిశుభ్రతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ దృష్టికి తీసుకువెళ్లారు. దాంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మండల ఎంపిడిఓ దృష్టికి తీసుకువెళ్లి పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ఆదేశాలతో అధికారులు గ్రామానికి వెళ్లి కాలువల్లో పూడిక తీయించారు. పారిశుధ్య చర్యలు తీసుకున్నారు. గ్రామాల్లో రోగాలు వ్యాప్తి చెందకుండా పకడ్బంది చర్యలు చేపట్టారు. త్వరలో కాలనీలో నూతన మురుగు కాలువలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ మేరకు అంచనాలు తయారు చేయించామని, త్వరలో కాలువల నిర్మాణం చేపడతామని వివరించారు.

## డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివాస్



**బుచ్చి జూన్ 23 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలో అర్బన్ బిజెపినాయకులు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమం అర్బన్ అధ్యక్షులు రామిశెట్టి కళ్యాణ్‌కుమార్ నేతృత్వంలో నిర్వహించారు. ప్రతి శక్తి కేంద్రంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ జరుపుకున్నట్లు నాయకులు తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి,బుచ్చిరెడ్డిపాళెం అర్బన్ ఇన్‌చార్జి గడ్డం విజయ్‌కుమార్ పాల్గోన్నారు. డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి ప్రతి శక్తి కేంద్రంలో పూలమాల వేసి,నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో బిజెపి సీనియర్‌నాయకురాలు రామిశెట్టి రమణమ్మ, జిల్లా కార్యదర్శి కాసా శ్రీనివాసులు, పూర్వ అధ్యక్షులు రామిశెట్టి మోహన్‌బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు మాచవరం శ్రీనివాసులు, నాయకులు మహిమలూరు ప్రవీణ్‌కుమార్, పార్లపల్లి మహేష్‌నాయుడు, గోళ్ళ నరసింహులు, యారాసి రామారావు, కోణం శ్రీనివాసులు, బొందిలి శాలినిరాణి, బిజెవైఎం అర్బన్ అధ్యక్షులు తానా మణికంఠ, బిజెవైఎం నాయకులు మహిమలూరు శ్రీనివాసులు, మామిళ్ళ శ్రీనివాసులు, కార్యకర్తలు పాల్గోన్నారు.

## ఘనంగా డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జి బలిదాన దివస్



**బుచ్చి జూన్ 23 ప్రభాతవార్త :** బుచ్చి రెడ్డిపాళెం మండలంలోని మినగల్లు, పెనుబల్లి, గ్రామాలలో పోలింగ్ బూత్ లోని బిజెపినాయకులు , జనసంఘ్ వ్యవస్థాపకులు అఖండ భారత్ స్వాప్నికుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బిజెవైఎం జిల్లా కార్యదర్శి గెండి పెంచలకృష్ణా, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌కె యశ్వంత్ సింగ్, జిల్లా కిసాన్‌మోర్చ అధ్యక్షులు చేవూరు వినయ్‌నారాయణ, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు బాల రాఘవరెడ్డి తదితరులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు దేశ సమైక్యత,సమగ్రత కోసం ప్రాణాలిర్పించిన భరతమాత ముద్దుబిడ్డ అమరవీరుడు ఏక్‌దేశ్‌మే దోవిధాన్ ,దో ప్రధాన్,దోనిషాన్‌నహీ ఛలేంగే అని నినదించిన మహానీయుడు అని కొనియాడారు. సమైక్య భారత్‌కోసం పోరాటం చేసిన మహోన్నత దేశభక్తుడు అని వారు కోనియాడారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో కలిసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో బిజెపి, నాయకులు కీలుకుప్ప శ్రీనివాసులు, గండి వీరనారాయణ, పెజ్జాయి ప్రసన్నకుమార్‌రెడ్డి, గుడి అంకయ్య, టి శివకుమార్‌రెడ్డి, గుమ్మ కిరణ్‌కుమార్‌రనెడ్డి,గుమ్మా కిరణ్‌కుమార్, పిచ్చాల రాజారెడ్డి, మహిమలూరు ప్రవీణ్‌కుమార్, సతీష్, పంట రమణారెడ్డి, పెంచలబాబు, వంగపాటి వెంకటసుబ్బయ్య,లక్కు సుబ్బరామిరెడ్డి, కల్లుట్ల సుబ్బరాయుడు, మూలే.బాషా, గండి లక్ష్మయ్య, గండి ప్రభాకర్, గెండి పెంచలయ్య, గంగవరపు పెంచలరెడ్డి తదితరులు పాల్గోన్నారు.

## మాలేపాటిని కలిసిన పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు



**దగదర్తి, జూన్ 23, ప్రభాతవార్త :** మండలంలోని పలు గ్రామ పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు దగదర్తి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ మాలేపాటి రవీంద్ర నాయుడుని వారి నివాసంలో కలిసి పలు సమస్యలపై విన్నవించడం జరిగింది. టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ.. గ్రామాల్లోని ప్రతి సమస్యను పరిష్కరించే విధంగా పనులు చేపడతామని ఈ సందర్భంగా వచ్చిన వారందరికి రవీంద్రనాయుడు హామీ ఇచ్చారు. అలాగే వచ్చిన వారందరికి మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీరితో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు మాలేపాటి సుధాకర్‌నాయుడు, కంచర్ల కృష్ణ, వట్టిగుంట గోపాల్, వర్ధినేని కృష్ణ, పి.రమణమ్మ, మన్నూరు రమణయ్య, వెంకటరమణ, రవి, మణి, హరి, ఎం.కృష్ణ, పెంచలయ్య తదితర గ్రామస్తులు, పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

## కోటాయపల్లి భూ సమస్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 23, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి మండల పరిధిలో గల కొటాయిపల్లి భూముల రీ సర్వేపై సోమవారం కలెక్టర్‌కి పెంద్యాల గాంధీ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే పేరుతో గత ప్రభుత్వం హయాంలో వ్యవసాయ భూమిని తగ్గించటమే కాక అక్రమంగా ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేసిన వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి మాకు న్యాయం చేయాలని ఫిర్యాదు విన్నపాలు ఫిర్యాదు దారుడు పెంద్యాల గాంధీ, తండ్రి నరసింహులు, వరికుంటపాడు గ్రామం ఉదయగిరి మండలం నెల్లూరు జిల్లా. సదరు జిల్లా ఉదయగిరి మండలం కొటాయపాలెం గ్రామంలోని అవకతవకలు జరిగిన సర్వే నెంబరు 101/8, 114/3 కలెక్టర్ చర్యలు తీసుకోవాలని మొదటి సూచీకలో పేర్కొన్న నేను మా స్వగ్రామంలో జరిగిన అవకతవకలపై విచారణ కొరకు ఈ విషయాలను మీకు విన్నవిస్తున్నాను. మా తండ్రి పెంద్యాల నరసింహులు పేరు మీద కొటాయిపల్లి గ్రామంలోని సర్వే నెంబరు 101/లో 99 సెంట్లు వ్యవసాయ భూమి కలదు. ఉద్యోగం నిమిత్తం నేను వేరే ప్రాంతంలో ఉండటంతో ఆ భూమిని మా తల్లిదండ్రులు సాగు చేసుకుని జీవించే వారు. 2023 ఏప్రిల్ 18న మా తండ్రి చనిపోయారు. ఖర్మకాండలు అన్ని ముగించుకుని మా తండ్రి పేరున ఉన్న పొలం మా అమ్మ పేరు మీదకు మార్చాలని స్థానిక వీఆర్వోని 2023 జులై 21న కలిసి విన్నవించారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం రీ సర్వే జరుగుతుందని, అది పూర్తయ్యాక కొత్త పాస్ పుస్తకాలు ఇస్తుందని, అప్పటి వరకు ఆగాలని వీఆర్వో నాకు చెప్పారు. అది నమ్మి నేను నా ఉద్యోగ బాధ్యతల నిమిత్తం బెంగుళూరు వెళ్లిపోయాను. 2023 సెప్టెంబర్ 13న మా తండ్రి పేరున కొత్త పాస్ పుస్తకం ఇచ్చారు. అయితే పాస్ పుస్తకంపై మా తండ్రి ఫొటో మార్చేశారు. ఆధార్ కార్డు నెంబర్, ఫోన్ నెంబర్ తప్పుగా వేశారు. అంతే కాక ఆ రీ సర్వేలో మా భూమిని 99 సెంట్లు నుంచి 75 సెంట్లకు తగ్గించారు. ఈ విషయమై సదరు ఉదయగిరి మండల తహాశీల్దార్‌కు లిఖిత పూర్వకంగా విన్నవించుకున్నాము. పాస్ పుస్తకంలో దొర్లిన తప్పులను సరి చేయాలని కోరారు. అంతే కాక మాకు సంబంధించిన 99 సెంట్ల భూమి మాకు చూపించాలని వేడుకున్నాము. మాకు తగ్గిన 24 సెంట్లు భూమి రోడ్డు నిర్మాణంలో కలిసి పోయిందని అధికారులు చెప్పారు. వస్తావానికి 1970 లో ఆ రోడ్డు నిర్మించారు. మా తండ్రి 1997 ఏప్రిల్ 7వ తేదీన మొదటి సారి పట్టాదారు పాస్ పుస్తకం జారీ చేశారు. అప్పటికే రోడ్డు నిర్మించి ఉన్నప్పటికి మా భూమి విస్తీర్ణం తగ్గటానికి రోడ్డు కారణంగా చూపి వారు చేసిన తప్పును కప్పిపుచ్చుకున్నారు. ఒక వేళ రోడ్డు నిర్మాణంలో మా భూమి పోయిందని సరిపెట్టుకున్నా మరి మా తండ్రి ఫొట మారటానికి ఆధార్ నెంబరు, ఫోన్ నెంబరు తప్పుగా నమోదు చేయటానికి కారకులు ఎవరు అని అడిగితే సమాధానం చెప్పే వారు కరువయ్యారు. వాటిని సరి చేయమని కోరినా ఎవ్వరూ స్పందించడం లేదు. ఆ కారణంగా 2025 జూన్ 16వ తేదీన ఉదయగిరి తహాశీల్దార్ కు మరొకసారి వినతిపత్రం సమర్పించాము. అయినా ఎవ్వరు మా సమస్యను పట్టించుకోవడం లేదు. అదియును గాక మా గ్రామంలో సర్వే నెంబరు 114/3 ప్రభుత్వ భూమి ఉంది. ఆ భూమిని స్మశానం భూమిగా మూడు తరములుగా వినియోఇంచుకుంటున్నాము. ఆ భూమిలో రెండు ఎకరాలు సన్నిబోయిన సుజాత అనే ఆమెకు ధారాదత్తం చేశారు. అందుకోసం మండల తహాశీల్దార్‌కు 2 లక్షలు లంచం ఇచ్చామని సుజాత తరుపు వారే ప్రచారం చేస్తున్నారు. అందులో వాస్తవాలు మాకు తెలియనప్పటికి ఇప్పుడు సుజాత తరుపు వారు స్మశానంలో సమాధులను జేసీబీతో దున్నించేశారు. స్మశానంలోకి ఎవ్వరు వెళ్ళకుండా కంచె కట్టేశారు. అంతే కాక స్మశాన భూమిలో ఉన్న రూ.2లక్షల విలువ గల 50 ఏళ్ల వయస్సున్న 30 వేప చెట్లను, అమ్మేసుకున్నారు. గ్రామస్తులు తమ పూర్వీకుల సమాధుల వద్దకు వెళ్ళనీయకుండా అడ్డుకుంటున్నారు, ఇవ్వన్నీ గ్రామ, మండల స్థాయి అధికారులకు తెలిసినా అందరూ నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కావున కలెక్టర్ ఈ విషయాలపై జిల్లా స్థాయి అధికారుల చేత విచారణ జరిపించి ఇన్ని అవినీతి అక్రమాలకు పాల్పడిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తద్వారా మా పాస్ బుక్‌లో తప్పులు సవరించి మాకు సంబంధించిన 99 సెంట్ల భూమిని మాకు అప్పగించడానికి చర్యలు తీసుకోవాలని విన్నవించుకుంటున్నాము. ఆక్రమణలను గురైన స్మశానం భూమిని తిరిగి గ్రామస్తులకు అప్పగించడానికి తగు చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

## కలువాయి ఎస్ఐగా కోటయ్య



కలువాయి జూన్ 23 ప్రభాతవార్త కలువాయి మండలం నూతన ఎస్ఐగా ఎస్ కోటయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విఆర్‌లో విధులు నిర్వహిస్తున్న కోటయ్య ఇటీవల జరిగిన బదలీలలో కలువాయి ఎస్ఐగా నియామకంకావడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మండలంలోని శాంతి భద్రతలు కాపాడేందుకుపూర్తి స్థాయిలో కృషి చేస్తానని చెప్పారు. బస్టాండ్ కూడలిలలో ట్రాపిక్ సమస్య పైన ప్రత్యేక దృష్టి పెడతానని చెప్పారు.

## బోగోలు లో శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి




**బిట్రగుంట జూన్ 23 ప్రభాతవార్త:** బోగోలు మండలంలోని బిజెపి పార్టీ కార్యాలయం లో మండల బిజెపి అధ్యక్షులు వీరాల శ్రీనువాసులు ఆధ్వర్యంలో డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ గారి 73వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మండల బిజెపి పార్టీ మాజీ అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు, గుర్రం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కృష్ణ, మండల మహిళా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి బిజెపి నాయకులు గోవింద రాజులు, సూర్యం, యువ మోర్చా కిషోర్, సాయి,సుబ్బారావు, బిజెపి అభిమానులు అందరూ పాల్గొని ముఖర్జీ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

## నూతన ఎస్ఐ బాధ్యతలు స్వీకరణ



**బిట్రగుంట జూన్ 23 ప్రభాతవార్త:**బోగోలు మండలం బిట్రగుంట పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐ గా ఎన్. ప్రభాకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కావలి టూ టౌన్ నుండి బిట్రగుంట స్టేషన్ కు బదిలీ కాగా ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ భోజ్యానాయక్ నెల్లూరు విఆర్ కు బదిలీ కావడం తెలిసిందే.

## ఘనంగా పుట్టేషావలి పీర్ గంధమహోత్సవం



**కావలిరూరల్, జూన్23 ప్రభాతవార్త :** కావలి ఒంగోలు బస్టాండ్ సమీపంలోని హజరత్ సయ్యద్ ఫక్రుద్దీన్‌బాబా ఉరఫ్ పుట్టేషావలి పీర్ రహ్మతులా అలైహివారి గంధమహోత్స వ కార్యక్రమం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ గంధమహోత్స వ కార్యక్రమానికి కావలి ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించడం జరిగింది. దర్గాకు విచ్చేసిన ఎమ్మెల్యే దగుమాటిని దర్గా కమిటి సభ్యులు ఘనస్వాగతం పలికారు. అనంతరం భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.

## ఎమ్మెల్యే ని కలిసిన మైనారిటి కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్



**కావలిరూరల్, జూన్23 ప్రభాతవార్త :** కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డిని రాష్ట్రమైనారిటి కార్పొరేషన్ ఛైర్మన్ ముస్తాక్ కావలిలోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కావలి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే దగుమాటి చేస్తున్న కృషిని మైనారిటి కార్పొరేషన్ ఛైర్మన్ ముస్తాక్ అభినందించడం జరిగింది. అనంతరం తన నివసానికి విచ్చేసిన ముస్తాక్‌ను ఎమ్మెల్యే దగుమాటి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కావలి పట్టణ టిడిపి ముస్లిం మైనారిటిసెల్ అద్యక్షులు రహీం, రాష్ట్రముస్లిం మైనారిటి ఆర్గనైజింగ్ సెక్రటరి షేక్.మస్తాన్, తదితర ముస్లింనేతలు పాల్గొన్నారు.

## చెన్నాయపాలెంకు బస్సు సౌకర్యం కల్పించడంపై బిజెపి నేతల హర్షం



**కావలిరూరల్, జూన్23 ప్రభాతవార్త :** మండలం కొత్తసత్రం గ్రామం నుండి చెన్నాయపాలెం వరకు బస్సుసౌ కర్యంలేని కారణంగా ఆయా గ్రామాలప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బిజెపి కావలి రూరల్ మండల అధ్యక్షులు జరుగుమల్లి జయకుమార్ ఆధ్వర్యంలో బిజెపినేతలు ఆర్‌టిసి జోనల్ ఛైర్మన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డిని, కావలి ఆర్‌టిసి డిపో ఇన్‌చార్జి మేనేజర్ రాపూరు శ్రీనివాసులును కలిసి చెన్నాయపాలెంకు బస్సు సౌకర్యాన్ని మంజూరు చేయమని సోమవారం విజ్ఞప్తి చేయడం జరిగింది. అందుకు వారు స్పందించి వెంటనే బస్సు సౌకర్యాన్ని కల్పించడానికి అంగీకరించడం జరిగింది. ఈ సందర్భంగా కావలిరూరల్ మండల బిజెపి అద్యక్షులు జరుగుమల్లి జయకుమార్ మాట్లాడారు. కొత్తసత్రం నుండి చెన్నాయపాలెంవరకు బస్సుసౌకర్యం లేనికారణంగా సదరు గ్రామాల ప్రజలు అనేక రోజులుగా పడుతున్న ఇబ్బందులు తీరనున్నాయని తెలియచేశారు. ఇందుకు సహకరించిన కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డికి, జోనల్ ఛైర్మన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి రూరల్ మండల బిజెపి వైస్ ప్రెసిడెంట్ బండ్ల తిరుపతి, కార్యదర్శి కోడూరు రాజ, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు మెరుగైన వైద్యం అందించే విషయంలో నిర్లక్ష్యం సహించను



**నెల్లూరు, జూన్ 23, ప్రభాతవార్త-వైద్యం :** పేదలకు మెరుగైన వైద్యం అందించే విషయంలో రాజీపడబోనని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కోఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు వెల్లడించారు. సోమవారం ఆయన ఆసుపత్రిలోని తన కార్యాలయంలో వార్తతో మాట్లాడారు. అతి కొద్ది కాలం క్రితమే బాధ్యతలు చేపట్టిన తాను కమిటీలోని అందరు సభ్యులను సమన్వయం చేసుకొని ఆసుపత్రి అభివృద్ధికి పాటుపడతానని ఈ సందర్భంగా తెలియజేశారు. హాస్పిటల్‌లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించినట్లు తెలిపారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి ప్రతి రోజు వందలాది మంది ప్రజలు వస్తుంటారని వీరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విధాలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఆసుపత్రిలో అన్ని విభాగాలు సక్రమంగా పని చేస్తున్నాయని ఒక్క ఎక్స్ రే విభాగాన్ని మాత్రమే ప్రక్షాళన చేయాల్సి న అవసరం ఉందన్నారు. ఈ విభాగంపై కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు సేవలు అందించే ఏఆర్టీ సెంటర్లో వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. రోగులకు భోజనం, తాగునీరు సక్రమంగా అందుతున్నట్లు తెలిపారు.

## కండలేరులో 34.975 టీయంసీల నీటిమట్టం



**రాపూరు, జూన్ 23, ప్రభాతవార్త :** మండలంలోని కండలేరు జలాశయంలో సోమవారం ఉదయం నాటికి జలాశయంలో 34.975 టీయంసీల నిటిమట్టం నమెదు అయినట్లు కండలేరు ఎఇ తిరుమలయ్య తెలిపారు. జలాశయం నుండి హెడ్ రెగ్యులేటర్ ద్వారా 2550 క్యూసెక్కులు, లో లేవల్ స్యూయిస్ ద్వారా 70 క్యూసెక్కులు,హైలెవల్ కెనాల్ నుండి 20 క్యూసెక్కుల చొప్పున మొత్తం 2640 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

## గుర్తు తెలియని వాహనం ఢీ కోని వ్యక్తి మృతి



**రాపూరు,జూన్23ప్రభాతవార్త :** జాతియ రహదారి 565పై రాపూరు మండలంలోని పెనుబర్తి గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకోని సోమవారం తెల్లవారుజామున రాపూరుకు చెందిన నగిరి వేణు(42), మృతి చెందాడు. మృతుడు వేణు శనివారం పెంచలకోనకు వెళ్లి తిరిగి రాపూరుకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న రాపూరు పోలీసులు సంఘటనా స్దలానికి చేరుకోని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఈ ప్రమాదంలో మృతుని కాలు,చేయి నుజ్జు,నుజ్జు అయ్యాయి. ఈ మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి బార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు వున్నారు.

## విద్యార్ధులు కరుణామయి సేవలను సద్వినియోగం చేసుకోవాలి



**గోనువల్లి(రాపూరు),జూన్23ప్రభాతవార్త :** విద్యార్ధులు కరుణామయి భగవతి శ్రీశ్రీశ్రీ విజేయేశ్వరీ దేవి సేవలను సద్వినియోగం చేసుకోవాలని రాపూరు మండల విద్యాశా ఖాధికారి గుండవోలు శ్రీనివాసులు కోరారు. సోమవారం రాపూరు మండలంలోని గోనుపల్లి గ్రామంలోని కరుణామయి విద్యాలయంలో ఆయన విద్యార్దులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గోని విద్యార్ధులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్బంగా యంఇఒ మాట్లాడుతూ పేద విద్యార్ధులకు మంచి విద్యను అందించాలన్న సదుద్ధేశంలో మారుమూల ప్రాంతమైన ఇక్కడ కార్పోరేట్ స్ధాయి భవనాలు నిర్మించి, నిష్ణాతులైన ఉపాధ్యాయులచే విద్యార్దులకు ఉచితంగా విద్యను అందించడంతో పాటు వారికి కావలసిన రవాణా సౌకర్యాలను, పాఠ్య,నోటు పుస్తకాలు, యూనీఫామ్, బూట్లు, బ్యాగులు, వంటి వాటిని అమ్మ శ్రీ విజయేశ్వరీ దేవి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్ధి కష్టపడి చదివి ఉన్నత పలితాలు సాధించి సమాజంలో మంచి గౌరవప్రదమైన స్ధాయికి చేరుకోని అమ్మ చేస్తున్న ఈ సేవలకు సార్ధకతను తీసుకురావాలని కోరారు. ప్రతి ఏడాది క్రమం తప్పకుండా విద్యార్ధులకు అన్ని విద్యా సౌకర్యాలను అందిస్తున్న పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ పులిపాటి విజయభరత్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్స్‌పాల్ వెంకటరాముడు, ప్రధానోపాధ్యాయుడు టి. మస్తాన్ రావు, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్ధినీ, విద్యార్ధులు పాల్గోన్నారు.

## వెంకట్రావుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్ధి మిత్ర కిట్లు పంపిణీ



**ఉదయగిరి, జూన్ 23, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని కొండయ్యపాలెం పంచాయతీలో గల వెంకట్రావుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం తిరుమలపురం నుండి విద్యార్థులు అడ్మిషన్స్ అయ్యారు. ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి తిరుమలాపురం నుండి ఉచిత ఆటో సౌకర్యాన్ని కల్పించినందుకు, ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చల్లా వెంకటేశ్వర్లు, సీనియర్ ఉపాధ్యాయులు ఎం.బలరామయ్య, షేక్ జమీర్, శ్రీనయ్య, షేక్ కరిముల్లాహుస్సేన్, మన్నేటి వెంకటరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగా చేరిన విద్యార్ధులకు కృష్ణ విద్యార్థి మిత్ర కిట్లును అందజేశారు.

## సచివాలయ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



**వింజమూరు, జూన్ 23, ప్రభాతవార్త :** సచివాలయ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగులు సోమవారం ఎంపీడీఓ కే.శ్రీనివాసరెడ్డిని కలిసివినతిపత్రం అందజేశారు.నోషనల్ ఇంక్రిమెంట్లు, స్పష్టమైన జాబ్ చార్ట్ ఇవ్వాలని సీనియర్ అసిస్టెంట్లుకు పే స్కేల్ వర్తింపచేయాలని అర్హులైన సచివాలయ సిబ్బంది అందరికి ప్రమోషన్లు ఇవ్వాలని, గ్రామ వార్డు సచివాలయాలలో పని చేస్తున్న వారికి సొంత మండలంలోని పని చేసుకునే వెసులుబాటు కల్పించాలన్నారు. సీనియార్టీ జాబితా విడుదల చేసి దాని ప్రాతిపదికన వెబ్ కౌన్సిలింగ్ ద్వారా పారదర్శకంగా బదిలీలు జరపాలన్నారు. హేతుబద్దీకరణ, మిగిలిపోయిన సిబ్బంది భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వాలన్నారు. సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కా రానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు ఓవీ నారాయణ, పి.మోహన్, ఎల్లాల భరత్, భూమిరెడ్డి, శ్రీరామ్, దండే నరసింహులు, శిరీష, అశ్విని, నికిత, అబ్దుల్ ఇతర సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యశాలకు సంబంధించిన షాపుల బకాయిలు వెంటనే వసూలు చేయాలి



**కావలిరూరల్, జూన్23 ప్రభాతవార్త :** కావలి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు సంబంధించిన షాపుల బకాయిలు వెంటనే వసూలు చేయాలని దళిత సంఘర్షణాసమితి జిల్లా అధ్యక్షులు యస్.మల్లి తెలిపారు. గ్రీవెన్స్‌డే సందర్భంగా దళిత సంఘర్షణసమితి జిల్లా అధ్యక్షులు యస్.మల్లి ఆధ్వర్యంలో సోమవారం ఆర్‌డిఓ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి ఇన్‌చార్జి ఆర్‌డిఓ సూర్యనారాయణసింగ్‌కు వినతిపత్రం అందచేసి మాట్లాడారు. కావలి ఏరియా వైద్యశాలకు సంబంధించి 20 షాపులవరకు ఉన్నాయని, ఆ షాపులకు సంబంధించిన బకాయిలు వెంటనే వసూలుచేసి తీరప్రాంతాల నుండి వచ్చే రోగులకు భోజనం చేసేందుకు ఒక కాంప్లెక్స్‌ను నిర్మించి ఇవ్వాలని తెలియచేశారు. ఈ కాంప్లెక్స్ లో భోజనం చేసేందుకు సౌకర్యవంతంగా ఉంటుందని, బకాయిలు వసూలు చేసి అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్‌కు సంబంధించిన షాపుల బకాయిలు వసూలుచేసి, ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్ అభివృద్ధికి కృషిచేసి, నీటి సౌకర్యం, తదితర మౌలిక వసతులు కల్పించాలని కోరారు. మున్సిపాలిటిలోని చివరిప్రాంతాలను అభివృద్ధిచేయాలని దానిద్వారా పేదలకు మంచి జరుగుతుందన్నారు. షాపులద్వారా వచ్చే ఆదాయాలు మురికివాడలకు ఉపయోగించాలని, బకాయిలకు ఎగనామం పెట్టేవారిపై కఠినచర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జరుగుమల్లి విజయరత్నం, కె.నరసింహులు, జడ్డా వాసు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంఈఓగా బాధ్యతలు స్వీకరణ



**వింజమూరు, జూన్ 23, ప్రభాతవార్త :** వింజమూరు మండల విద్యాశాఖాధికారి-1గా బి.గోవిందయ్య బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ బాధ్యతలు నిర్వహిస్తున్న బి.శ్రీధర్ పదవీ విరమణ చెందడంతో ఎంఈఓ-1 ఖాళీ అయింది. నూతన ఎంఈఓ వన్‌గా గోవిందయ్య బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కావలి రెగ్యులర్ ఎంఈఓగా పని చేస్తూ ఎఫ్ఏసీగా వింజమూరుకు రావడం జరిగిందన్నారు. ఉద్యోగులకు అవసరమైన సౌకర్యాలను సకాలంలో అందించగలరని ఎలాంటి జాప్యం లేకుండా ఉండేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 మధుసూదన్‌రెడ్డి, ఎంఐసీ మౌనిక, జలీల్, శ్రీహరిత దితరులు ఉన్నారు.

## బాలికకు అండగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



**కోవూరు, జూన్23 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఇందుకూరుపేట మండలం కుడితిపాలెంలోని కాకర్ల దిబ్బలో జరిగిన ఘటనలో తీవ్రంగా గాయపడిన చెంచమ్మ అనే బాలికకు వేమిరెడ్డి దంపతులు అండగా నిలిచారు. ఈ మేరకు వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ బాలికకు వైద్య సదుపాయాలు కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఆ బాలిక పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వెంటనే స్థానిక నాయకులతో మాట్లాడి మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని ఈ సందర్భంగా సూచించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో టీడీపీ నేతలు కోడూరు కమలాకర్‌రెడ్డి, దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పవన్‌రెడ్డి, మైనార్టీ నాయకులు షేక్ ఇంతియాజ్‌లు ఆ బాలికను ఇందుకూరుపేట ప్రభుత్వ ఆస్పత్రి నుంచి అపోలో ఆస్పత్రికి తీసుకువచ్చి మరింత మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. బాలికపై బంధువులు దారుణంగా దాడి చేసి వాతలు పెట్టిన సంగతి తెలుసుకున్న ఎమ్మెల్యే ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించారు. ఆ బాలికపై దాడి చేసిన వ్యక్తులపై తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఆ బాలిక పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆమె నేతలకు సూచించారు. బాలికకు అన్ని విధాల అండగా ఉంటామని ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు.

## అన్ని పాఠశాలల్లో వంట గదులు ఉపయోగించుకోవాలి

- వార్తకు స్పందన



**కోవూరు, జూన్23 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వంట గదులు ఉన్నా అవి వంటకు ఉపయోగించకపోవడంతో సోమవారం ఈ వంట గదులను ఉపయోగించుకోరా అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి మండల విద్యాశాఖ అధికారి -2 వై. చెంచులక్ష్మమ్మ స్పందించారు. ఈ మేరకు ఆమె స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం సీఆర్ఎంటీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలలో ఉన్న ఈ వంట గదులను ఉపయోగించుకునేలా తగు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆమె సీఆర్ఎంటీలకు ఆదేశాలు ఇచ్చారు.

## వైసీపీ ప్రభుత్వంలో1.83 కోట్ల మంది లబ్దిదారులు నష్టపోయారు



**కోవూరు, జూన్23 ప్రభాతవార్త :** గత వైసీపీ ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను దారి మళ్లించడం వలన రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులు విడుదల చేయకపోవడం వలన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 39,642 కోట్లు నష్టపోయిందని జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి తెలిపారు. కోవూరులోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రాయుధ పథకాల కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులకు రాష్ట్ర ప్రభుత్వం కూడా తమ వాటా నిధులను విడుదల చేయాల్సి ఉందన్నారు. అయితే గత ప్రభుత్వం ఈ నిధుల విషయంలో నిర్లక్ష్యం చూపడంతో 134 కేంద్ర ప్రాయుధ పథకాల ద్వారా జరగవలసిన లబ్ది జరగకపోగా దాదాపు 1.83 కోట్ల మంది లబ్దిదారులు నష్టపోయారన్నారు. ముఖ్యంగా మహిళలకు, శిశువులకు, గర్భిణులకు రావాల్సి న అనేక పథకాలు ఈ కారణంగా ఆగిపోయాయన్నారు. ప్రధానమంత్రి సడక్ యోజన పథకం కింద రహదారి నిర్మాణం కొరకు గత ప్రభుత్వం రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయకపోవడం వలన గతంలో 916 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం స్తంభించిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మ్యాచింగ్ నిధులు విడుదల చేయడంతో ఈ ఏడాదిలో 435 కిలోమీటర్ల రహదారి నిర్మాణం పూర్తయిందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు ఈ పథకాన్ని ఉపయోగించుకోగా మన రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయకపోవడంతో రాష్ట్రంలోని 95 లక్షల గ్రామీణ కుటుంబాలకు ఈ పథకం కింద కుళాయి కనెక్షన్ ఇవ్వాలనే లక్ష్యం నెరవేరలేదన్నారు. ఇప్పటికైనా ప్రజలు గత వైసీపీ పాలనలో జగన్‌మోహన్‌రెడ్డి రాష్టానికి ఎంత మేర అన్యాయం చేశారో ప్రజలు గమనించాలన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయడంతో 82 కేంద్ర ప్రాయోజిత పథకాలకు మరలా జీవం వచ్చిందన్నారు.

## మోటార్ సైకిల్‌ను ఢీకొన్న వ్యాన్

- యువకుడు మృతి





**కోవూరు, జూన్23 ప్రభాతవార్త :** కోవూరు మండలం జమ్మిపాలెం వద్ద ఆదివారం అర్ధరాత్రి నెల్లూరు వైపు నుంచి జమ్మిపాలెంకు వస్తున్న మోటార్ సైకిల్‌ను.. జమ్మిపాలెం నుంచి వస్తున్న మినీ వ్యాన్ వేగంగా ఢీకొంది. ఈ సంఘటనలో నెల్లూరులోని ఓ ప్రైవేట్ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న ఎం. సుధీర్‌కుమార్ (35) తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందారు. ఐదు నిమిషాలైతే సుధీర్‌కుమార్ ఇంటికి వెళ్లేవారు. కేవలం ఈ మినీ వ్యాన్ అతి వేగంగా రావడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని ప్రత్యేక సాక్షులు తెలిపారు. జమ్మిపాలెం ప్రాంతం నుంచి అర్ధరాత్రి వేల మోటార్లు, పైపులు వేసుకువస్తున్న ఈ వాహనం మోటార్ సైకిల్‌ను డీకొనడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఈ మేరకు సమాచారం తెలుసుకున్న కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతదేహంపై పడి కుటుంబ సభ్యులు రోధిస్తున్న తీరు పలువురిని కలిచివేసింది. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సుధీర్‌కుమార్ మృతితో జమ్మిపాలెం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## సైబర్ నేరాలపై ఫిర్యాదు



**కావలిరూరల్, జూన్ 23 ప్రభాతవార్త :** సైబర్ నేరాలపై కావలి ది కిరాణా మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్సా ప్రసాద్ ఆధ్వర్యంలో కావలి పట్టణంలోని వ్యాపారస్తులతో కలిసి సోమవారం కావలి ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఫిరోజ్‌కు సైబర్ నేరాలపై ఫిర్యాదుచేయడం జరిగింది. ఈ సందర్భంగా బల్సా ప్రసాద్ మాట్లాడారు. లైసెన్సులు తీసుకోవాలని, ఆహారం, తూనీకల కొలతలు మున్సిపాలిటి అధికారులమంటూ రాణా చౌదరి అనే వ్యక్తినుంచి ఫోన్‌కాల్స్ వస్తున్నాయని తెలియచేశారు. ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లించాలని బెదిరిస్తున్నారని తెలిపారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందని తెలియచేశారు. వ్యాపారస్తులకు ధైర్యంచెప్పి అండగా ఉంటామని భరోసా కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అద్యక్షులు తిరుపాలు, కమిటి, అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## రూ.24.63లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**కందుకూరు, జూన్ 23, ప్రభాతవార్త :** పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వ రరావు సోమవారం బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ చేశారు. 24.63 లక్షల రూ పాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్య పాలనతో వ్యవసాయ రంగం నష్టపోయిందని గుర్తు చేస్తూ ప్రస్తుతం ప్రతి నియోజకవర్గానికి సుమారు 3 కోట్ల రూపాయలు నిధులను నీటి పారుదల ప్రాజెక్టుల నిర్వహణ కొరకు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య భద్రత ప్రధానమైన బాధ్యతగా భావిస్తూ, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అనేక మంది నిరుపేదలకు ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాకుండా వైద్యం చేయించుకున్న బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నె రోశయ్య, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం, పార్టీ నాయకులు ఉప్పుటూరు శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, గోచిపాతల మోషే, చిలకపాటి మధుబాబు, షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, రెబ్బవరపు మాల్యాద్రి, రాయపాటి శ్రీనివాసరావు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## సమగ్ర కులగణన షెడ్యూల్ గజిట్ ప్రచురణపై హర్షం



**కోవూరు, జూన్23 ప్రభాతవార్త :** కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం కోసం అనేక మంచి నిర్ణయాలు తసీఉకుంటున్నారని, గతంలో కొన్ని అనివార్య కారణాల వలన వాయిదా పడిన జనగణన ప్రక్రియ మరలా ప్రారంభించేలా కేంద్ర ప్రభుత్వం గజిట్ ప్రకటించడం సంతోషదాయమని రాష్ట్ర చేనేత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేవీ శేషయ్య అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు కులగణనపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. వీటి ద్వారా వెనుకబడిన తరగతుల వారికి అన్ని రంగాల్లో తగు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారన్నారు. 2027 మార్చి 1 నుంచి దేశ వ్యాప్తంగా జనగణనతో పాటు సమగ్ర ఓబీసీ కులగణన జరిపించేందుకు షెడ్యూల్ ప్రకటించి ఈ నెల 16న గెజిట్ విడుదలకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం శుభపరిణామం అన్నారు. ఈ సారి జరిగే జనగణన ద్వారా దేశ జనాభా ఏ మేరకు పెరుగుతుందో తెలుసుకోవాలనే కోరిక ప్రతి ఒక్కరిలో ఉందన్నారు. కేవలం కరోనా కారణంగా 2021లో జరగాల్సి న జనగణన వాయిదా పడి ఎట్టకేలకు సమగ్ర కులగణనతో నిర్వహించేందుకు కేంద్రం షెడ్యూల్ ప్రకటించడం దేశ వ్యాప్తంగా సంతోషాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఎట్టకేలకు కేంద్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వ జనగణనతో పాటు కులగణన కూడా ఆమోదం తెలిపి షెడ్యూల్ ప్రకటించి గెజిట్ విడుదల చేయడం ఆనందదాయకమన్నారు.

## విద్యార్ధులకు ఉపకరణాల పంపిణీ



**నెల్లూరు,జూన్23 ప్రభాతవార్త -విద్య :** సోమవారం నగరంలోని స్ధానిక నవలాకు లతోట ప్రాంతంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్దులకు జాతీయబిసి సంక్షేమసంఘం జిల్లా యువజన విభాగం ఆధ్వర్యంలో ఉపకరణాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టా రు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కోర్ కమిటి సభ్యులు నూనెమల్లిఖార్జునయాదవ్ పాల్గొని మాట్లాడారు. చదువుతోనే ఉన్నత శిఖరాలు చేరుకోవటం సాధ్యమౌతుందన్నారు. విద్యార్దులు క్రమశి క్షణతో రాణిచిం అభివృద్ధి చెందాలని కోరారు. కూటమి ప్రభుత్వం విద్యార్దుల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమకార్యక్రమాలను చేపడుతుందన్నారు. ప్రభుత్వం పై అదనపు బారం పడుతుందని అని తెలిసినా కూడా కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని అందరూ పిల్లలకి అమలు చేసి ఇచ్చిన మాటను నిలబె ట్టుకో వటం జరిగిందన్నారు. అనంతరం విద్యార్దులకు బ్యాగులు,పెన్నులు, పుస్తకాలు తదితరాలను పంపి ణీచేశారు. ఈ కార్యక్రమంలో పెయ్యల పవన్‌కుమార్‌యాదవ్, లలితరామ్, సమాధి శ్రీనివాసులు, వెంక టజ్యోతి, పోలయ, రవికుమార్, గోపాల్, కాజా, జమీర్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## తహసిల్దారుని కలిసి సమస్యలపై చర్చించిన మండల బిజెపి నాయకులు



**మనుబోలు జూన్ 23 ప్రభాతవార్త :** మనుబోలు నూతన తహసిల్దారుగా బాధ్యతలు చేపట్టిన రమాదేవిని వాసిరెడ్డి రామిరెడ్డి ఆద్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి బిజెపినాయకులు బొక్కే అందజేశారు. అనంతరం వారు మండలంలోని సమస్యలు తెలియజేశారు. మండలంలో పలు రెవిన్యూ సమస్యలు వున్నాయని వారు తహసిల్దారుకి వివరించారు. స్పందించిన తహసిల్దారు రమాదేవి సమస్యలను పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. డిప్యూటి తహసిల్దారు ప్రదీప్ ,వ్యవసాయ శాఖ అధికారి వెంకటకృష్ణయ్యను కలిసి శాలువాతో సత్కరించారు. గత సంవత్స రంలో రైతులకు ఎరువులు అందుబాటులో లేక పలు సమస్యలు ఏర్పడ్డాయని ఈ సంవత్స రంలో ఆ సమస్య లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అగ్రికల్చర్ ఆఫీసర్‌ని కోరడం జరిగింది. ఈకార్యక్రమంలో బిజెపి మండల అద్యక్షులు కృష్ణారెడ్డి, ఏఎంసి డైరెక్టర్ బోలా శ్రీను వెంకయ్య తదితరులు పాల్గోన్నారు.

## ఘనంగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలు



**చేజర్ల జూన్ 23 ప్రభాతవార్త** భారతీయ జన సంఘ్ వ్యవస్ధాపకులు శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలు చేజర్లలలో సోమవారం మండల బిజెపి కార్యలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్బంగా శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసినటువంటి సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చ రాష్ట్రనాయకులు,కుంకు బాలయ్య నాయుడు,బిజెపి మండలాద్యక్షులు గుండాల విజయ్ బాస్కర్‌రెడ్డి, బిజెపి జిల్లానాయకులు ఈఎంసి జగ్గారెడ్డి, బిజెపి మండల ఉపాధ్యాక్షులు కోటేశ్వర్‌రెడ్డి, బిజెపి మండల ఉపాధ్యాక్షులు లాలి వెంకటయ్య, బిజెపి జయరామయ్య, బిజెపి మండల ఉపాధ్యాక్షులు దాసరి హజరతయ్య, బిజెపినాయకులు తెల్లపాటి వెంకరమణ నాయకులు పాల్గోన్నారు.

## రీ సర్వే పట్ల నిర్లక్ష్యం తగదు

**కోవూరు, జూన్23 ప్రభాతవార్త :** కోవూరు పంచాయతీకి సంబంధించి రీ సర్వే కార్యక్రమాన్ని యు ద్ధప్రాతిపదికన పూర్తి చేసేలా సంబంధిత సర్వే బృందాలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్యఅన్నారు. సోమ వారం తహసీల్దార్ కార్యాలయంలో కోవూరు పంచాయతీకి సంబంధించిన సర్వే బృందాలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. రైతులకు సంబంధించి భూములకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే అటువంటి వాటి పరిష్కారం కోసమే ప్రభుత్వ ఈ రీ సర్వే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ సర్వే పరిశీలన విషయంలో ఏమైనా సందేహాలు ఉంటే వాటిని వెంటనే నివృత్తి చేసుకుని ఈ కార్యక్రమం పూర్తి చేసేలా తగు చొరవతీసుకోవాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ బషీర్, సర్వేయర్లు ఉన్నారు.



## గిరిజన బిడ్డను పరామర్శించిన మాజీ మంత్రి

**కోవూరు, జూన్23 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఇందు కూరుపేట మండలం కుడితిపాలెం గ్రామంలో ఒళ్లంతా కాల్చి చిత్రహింసలకు గురి చేసిన గిరిజన బిడ్డచెంచమ్మను సోమ వారం మాజీ మంత్రి , వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రసన్నకుమార్‌రెడ్డి అపోలో ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా చెంచమ్మకు అందుతున్న వైద్యసేవలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆ బాలికకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని ఈ సందర్భంగా ఆయన డాక్టర్లను కోరారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి 20 వేల రూపాయలను ఆర్థిక సాయం కింద వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు, జొన్నవాడ దేవస్థాన చైర్మన్ మావులూరు శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.



## బాధ్యతగా విధులు నిర్వహించాలి

**కోవూరు, జూన్23 ప్రభాతవార్త :** సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తు న్న ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధులు బాధ్యతలు సక్రమంగా నిర్వహించేలా దృష్టి పెట్టాలని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ లీలావతి అన్నారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రం సమావేశ మందిరంలో సోమవారం కేంద్రంలో పనిచేసే వైద్యులు, ఆరోగ్య సిబ్బందితో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం మంచి పద్ధతి కాదన్నారు. సకాలంలో రోగులకు మెరుగైన సేవలు అందించి ఈ ఆరోగ్య కేంద్రానికి ఒక ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలన్నారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం వహించే సిబ్బంఇ తమ తీరు మార్చుకుని తమకు కేటాయించే విధులు బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే వారిపై తగు చర్యలు కూడా తీసుకోవడం జరుగుతుందన్నారు. పారిశుధ్య సిబ్బంది కూడా ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వెంకటాచలపతి గౌడ్, డాక్టర్ సలావుద్దీన్, డాక్టర్ వంశీకృష్ణ, హెడ్ నర్సు ప్రసూనలత, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.



## అన్నదాన పథకానికి రూ.100116 వితరణ

**నెల్లూరు,జూన్23 ప్రభాతవార్త-విద్య** నగరంలోని స్థానిక దర్గామిట్టలో వెలిసియున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో అన్నదాన పథకం కోసం నగరానికి చెందిన పి.వెంకటేశ్వర్లు రెడ్డి,ప్రణీత దంపతులు రూ.100116 నగదును సోమవారం ఆలయ ఈఓ, సహాయకమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డికి అందజేశారు. ఆలయ అభివృద్ధి, అన్నదానం కోసం భక్తులు ముందుకు రావటం సంతోషంగా ఉందని ఈఓ తెలిపారు. కాగా సోమవారం త్రయోదశిని పురస్కరించుకని సాయంత్రం ఆలయంలో ప్రదోషకాల పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అర్చక స్వాములు, ఆలయ సిబ్బంది , భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## డెయిరీ ఉద్యోగుల వయోఃపరిమితి 60 సంవత్సరాలకి పెంపు



**నెల్లూరు,జూన్23 ప్రభాతవార్త-విద్య** నెల్లూరుజిల్లా పాల ఉత్పత్తి దారుల పరస్పర సహాయకసహకార సమితి (విజయాడెయిరీ)లో పనిచేస్తున్న ఉద్యోగులు,కార్మికుల వయోఃపరిమితిని 60 సంవత్సరాలకు పెంచ టం జరిగిందని డెయిరీ పాలక మండలి చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని స్థానిక వెంకటేశ్వరపురంలోని విజయాడెయిరీలో డెయిరీ పాలకమండలి సమావేశంనిర్వహించారు. అ నంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ఉద్యోగుల పదవి విరమణ కాలం 58 సంవత్సరా లుగా ఉండదని, ప్రసుత్తం ఆ కాలాన్ని రెండేళ్ల పెంచి 60 సంవత్సరాలు చేయటం జరిగిందన్నారు. ఈ మేరకు పాలకమండలిలో ఆమోదం కూడా తీసుకోవటం జరిగిందన్నారు. డెయిరీ అభివృద్ది కోసం అందరూ కష్టపడి పనిచేయాలని ఆయన కోరారు. కాగా ఉద్యోగులు,కార్మికుల వయోఃపరిమితి పెంపు నిర్ణయంపై డెయిరీ ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తంచేశాయి. ఈ కార్యక్రమంలో డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ పిసి.కృష్ణ మోహన్, పాలకమండలి సభ్యులు కోడూరు శ్రీనివాసులు, కట చంద్రశేఖర్‌రెడ్డి, నీలపరెడ్డి దరశరధరామిరెడ్డి, ఆర్‌వి.ప్రసాద్ , డెయిరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ వద్ద హోరెత్తిన యువత పోరు

**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 23, ప్రభాతవార్త** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలో నిర్వహించిన యువతపోరు విజయవంత మైంది. స్థానిక అనిత హాలు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సిటీ నియోజకవర్గ ఇన్చార్జి, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి వందలాది మంది యువత ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు ఊటుకూరు నాగార్జున రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను విమర్శించారు. నెల్లూరు జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన కార్యక్రమం అనంతరం డిఆర్ఓకు వినతి పత్రం అందజేశారు. యువజన విభాగం అధ్యక్షుడు ఊటుకూరు నాగార్జున మాట్లాడుతూ జిల్లాలో వైసిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు నెల్లూరు సిటీ వైసిపి ఇన్చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సహకారంతో జిల్లాలో పెద్ద ఎత్తున యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు.వైఎస్‌ఆర్‌సిపి ఇచ్చిన ఒక పిలుపుతో జిల్లా నలుమూలల నుంచి యువత పోరు కార్యక్రమానికి తరలిరావడం జరిగిందన్నారు.ఎన్నికల సమయంలో చంద్రబాబు యువతను మభ్యపెట్టి ఓట్లు వేయించుకొని ఈ రోజు వారికి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కాలం పూర్తవుతున్నప్పటికీ.. యువతకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా చంద్రబాబు అమలు చేయలేదని అన్నారు. అధికారంలోకి రాగానే యువతకు 3 వేల రూపాయల నిరుద్యోగ భృతి, ఏడాదికి 5 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన చంద్రబాబు ఈరోజు ఆ హామీలన్ని మరచి.. అధికారంలోకి రాగానే యువతను వెన్నుపోటు పొడిచారని అన్నారు. ఇటీవల వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ చంద్రబాబు దుర్మార్గపు పాలనపై పుస్తకం విడుదల చేయడం జరిగిందని, అదే చంద్రబాబు జీవితంలో ఇప్పటివరకు చేసిన తప్పులను లెక్కిస్తూ పుస్తకాలను రచిస్తే అబద్ధాలు చంద్రన్న మోసాల బాబు అని ఊరికో లైబ్రరీ పెట్టాల్సి వస్తుందన్నారు. రెండు లక్షల 50 వేల మంది వాలంటీర్లకు అబద్ధపు హామీలు ఇచ్చి మోసం చేశారని, అలాగే ఏడాదికి ఐదు లక్షల ఉద్యోగాలు ఇస్తామని యువతను చంద్రబాబు మోసం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## అల్లూరు ఎస్సై గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ రెడ్డి

**అల్లూరు, జూన్ 23 ప్రభాతవార్త:** అల్లూరు ఎస్సైగా ఎ. శ్రీనివాసరెడ్డి సోమవారం నాడు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీఐ పాపారావు విలేకరులతో మాట్లాడుతూ అల్లూరుటౌన్‌లో రెండు మూడు రోజుల క్రితం అంజయ్య నాయుడు కాలనీలో బంగారం దోచుకున్న దొంగలను తొందరలో పట్టుకుంటామని తెలిపారు. అదేవిధంగా ప్రజలు ఎప్పుడైనా ఊళ్లకు వెళ్ళేటప్పుడు పోలీస్ స్టేషన్లో తెలియజేస్తే కొత్తగా ఎల్. ఎం.హెచ్.ఎస్ (యాంటీ లాక్ మోనిటైజరింగ్ సిస్టం) అనే పరికరాన్ని ఆ ఇంటిలో బిగించడం జరుగుతుందని దొంగలు పడినప్పుడు పోలీస్ స్టేషన్ కు అలర్ట్ మెసేజ్ వస్తుందని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నైట్ గస్తీలను పెంచుతామని తెలిపారు



## ఉడ్ కాంప్లెక్స్ అభివృద్ధి దశాబ్దాల కల నెరవేరింది: రూరల్ ఎమ్మెల్యే



**నెల్లూరు రూరల్, జూన్ 23, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 26వ డివిజన్ ఉడ్ కాంప్లెక్స్‌లో 1.50 కోట్ల రూపాయలతో నిర్మించిన సీసీ డ్రైన్లను పారంభించిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, ఆటో నగర్‌ను ఏ విధంగా అభివృద్ధిలో తీర్చిదిద్దామో అదేతరహాలో ఉడ్ కాంప్లెక్స్ ను అభివృద్ధి చేస్తాం అన్నారు. వ్యాపారస్తులు స్వచ్ఛందంగా ఉడ్ కాంప్లెక్స్ అభివృద్ధికి సహక రించారు. త్వరలో ఉడ్ కాంప్లెక్స్‌లో రోడ్లను కూడా పూర్తిచేస్తాం. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి చెప్పారు. ఈ సంవత్సర కాలంలో నెల్లూరు రూరల్ అభివృద్ధికి ఎనలేని సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజలపక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బూడిద సుప్రజ, క్లస్టర్ ఇంచార్జ్ మన్నెం పెంచల నాయుడు, కో క్లస్టర్ ఇంచార్జ్ ఎల్.పి.కృష్ణా రెడ్డి, 26వ డివిజన్ అధ్యక్షులు బూడిద పురుషోత్తంయాదవ్, టీడీపీ నాయకులు శివాచారి, గౌస్ బాషా, మల్లెబోయిన వెంకటే శ్వర్లు యాదవ్, జహీర్, జావీద్, మాధవి, రఫీ, శంకర్, కాలేషా, ఎజాస్, కృష్ణా రెడ్డి, నరసింహ ముదిరాజ్, రాజేష్, రాజు, సర్దార్, నస్రు, జుబేర్, కుమార్, కార్తీక్, బాబు, చాంద్ బాషా, హు స్సేన్, సమీర్,సల్మాన్,నాగమణి, లోకేష్ పాల్గొన్నారు.

## అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారంటూ తహశీల్దార్‌కు ఫిర్యాదు

**దగదర్తి, జూన్ 23, ప్రభా తవార్త** ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారని సీపీఎం పార్టీ నా యకులు గోపసాని రమేష్, ఒం టేరు సుధాకర్, పేరికల మా ల్యాద్రి తహశీల్దార్ పి.కృష్ణకు ఫి ర్యాదుచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ అధికారి కూడా ఫిర్యాదు చేయడం జరిగిందని వారు తెలిపారు. రాత్రి వేళలో ఎటువంటి అనుమతులు లేకుండా యధేచ్ఛగా గ్రావెల్ తరలిస్తున్నారు. దీంతో టిప్పర్లు తిరిగే దారిలో గిరిజన కాలనీ ఆనుకుని ఉందని తెలిపారు. టిప్పర్‌లో వెళ్లే సమ యంలో రోడ్డు పైన ఉన్న దుమ్ము ఇళ్లపై పడుతుందని, దీంతో ప్రజలు ఇబ్బదులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వారు తెలిపారు. అంతే కాక పిల్లలు ఇప్పుడు వీధుల్లోనే తిరుగుతూ ఆడుకుంటూ ఉంటారని అన్నారు. అనంతవరం చెరువుకి ఆనుకుని ఉన్న కలుసు దాటేందుకు బ్రిడ్జిని ఏర్పాటు చేసి ఉన్నారని బ్రిడ్జి గతంలో కురిసిన వానలు కారణంగా బ్రిడ్జి అక్కడక్కడ గుంతలు పడి ఉన్నాయి. దీంతో 30 టన్నుల గ్రావెల్ టిప్పర్ ఆ బ్రిడ్జిపై వెళ్తే బ్రిడ్జి కుంగి పోతుందని వాపోయారు. అంతే కాక అల్లూరు రోడ్డు నుంచి అనంతవరం వరకు ఏర్పాటు చేసిన తారు రోడ్డు టిప్పర్ల వల్ల గుంటలమయంగా తలపిస్తుందని వారన్నారు. గ్రావెల్ తరలింపు ఆపివేయాలంటూ తహశీల్దార్ కోరారు.



## "అందె" సేవలు ప్రశంసనీయం

**నెల్లూరు,జూన్23 ప్రభాత వార్త-విద్య** సమాజ సేవకై ఎస్‌విఆర్ విద్యాసంస్థల అధినేత అందె శ్రీనివాసులుచేసిన సేవలు ప్రశంస నీయమని ఆంధ్రప్రదేశ్ పద్మశాలి యువసేన రాష్ట్ర ప్రతినిధి మునగపాటి రమేష్ పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ అచీవ్‌మెంట్ అవార్డ్స్, ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమి,రియల్ బుక్ ఆఫ్ వరల్డ్‌రికార్డ్ సం యుక్త ఆధ్వర్యంలో ఇటీవల డాక్టరేట్ అందుకున్న అందె శ్రీనివాసులకు నగరంలోని స్థానిక ఎస్‌విఆర్ పాఠశాలలో సోమవారం అబినందన కార్యక్ర మాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతు అందరూ అందె స్పూర్తితో సేవా కార్యక్రమాల్లో పల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం సభ్యులు అందె శ్రీనివాసులును శాలువాలు కప్పి, పుష్పగుచ్చాలు అందించి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు మాగం వెంకటేశ్వర్లు, చేవూరి వెం కయ్య, ప్రిన్సిపాల్ బట్టు రమేష్, వింజమూరు వెంకటేశ్వర్లు, మురళి, అశోక్, విజయ్‌కుమార్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.




## కరుణామయిలో పేద విద్యార్ధులకు కార్పోరేట్ స్థాయి ఉచిత విద్య

**రాపూరు,జూన్23ప్రభాతవార్త** గ్రామీణ ప్రాంతమైన రాపూరు మండలంలో పేద విద్యార్ధులకు కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యను ఉచితంగా కరుణామయి విద్యాసంస్థలు అందిస్తున్న గోనుపల్లి, రాపూరు కరుణామయి పాఠశాలల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటరాముడు తెలిపారు. సోమవారం రాపూరులోని కరుణా మయి పాఠశాలలో కరస్పాండెంట్ పులిపాటి విజయ భరత్ ఆదేశాలతో విద్యార్ధులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెంచలకోనలోని మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమ వ్యవస్థాపకురాలు భగవతి కరుణామయి శ్రీశ్రీశ్రీ విజయేశ్వరీ దేవి పేదలకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించాలన్న మంచి ఆలోచనలో ఈ పాఠశాలను నిర్మించి విద్యార్ధులకు ఉచిత భోధనతో పాటు, వారికి కావలసిన విద్యా సామాగ్రి,రవాణా సౌకర్యం వంటి అన్ని సౌకర్యాలను ఉచి తంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్ధి కష్టపడి చదివి మంచి పలితాలు సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన కోరారు. అనంతరం మండల విద్యాశాఖాధికారి గుండవోలు శ్రీనివాసులు చేతుల మీదుగా పాఠశాలలోని విద్యార్థినీ,విద్యార్ధులకు పాఠ్యపుస్తకాలు,నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పిట్టబోయిన శంకరయ్య, ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## విధులకు అనుమతించకుండా వేధిస్తున్నారు

**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 23, ప్రభాతవార్త** కలువాయి మండలం దాచురు విఏఓ కె.శిరీ షగా విధులు నిర్వహిస్తున్నట్లు హైకోర్టు డ బ్ల్యూపి 16797/2024 ఉత్తర్వులు ఇచ్చి ఉన్న అనధికారికంగా దాచూరు సంఘ బంధం తీర్మానం లేకుండానే గ్రామంలో వెలుగు ఎపిఎంరవి,సిసి మస్తాన్ వలి వేరే ఇద్దరును గ్రామాల్లో అనధికారికంగా వెలుగు డిపార్ట్మెంట్ యాప్‌ల లాగిన్‌లు ఇచ్చి పని చేస్తు న్నారని సోమవారం కలెక్టరేట్‌లో, జరు గుతున్న ప్రజా సమ స్యల పరిష్కార వేదికలో డిఆర్ఓ ఉదయభాస్కర్‌కు అర్జీ ఇచ్చారు. కోర్టుధిక్కరణ కేసు కూడా హైకోర్టు నందు నడుస్తుంటే కలువాయి వెలుగు అధికారులు లెక్కచే యకుండా ఉన్నారని అర్జీలో పేర్కొన్నారు. గతంలో పని చేసిన విఓఏ స్వప్నను అప్పటి కలెక్టర్ టెర్మినేషన్ చేసిన ఇప్పుడు ఆ అమ్మాయి పేరునే ఆన్లైన్ లో ఎక్కించి ఆమె బదులు వేరే వాళ్ళ చేత అనధికారికంగా గ్రా మంలో పని చేస్తున్నారు. గౌరవ హైకోర్టు ఉత్తర్వులు అమలుచేసేట్లు చర్యలు తీసుకోవాలని ,అనధి కారికంగా టెర్మినేషన్ అయిన విఓఏ పేరు ఆన్లైన్‌లో ఎక్కించి మరొకరి చేత అనది. కారికంగా పని చేయిస్తున్న వారి పై చర్యలు తీసుకోవాలని తనను హైకోర్టు ఉత్తర్వులు అమలు చేసి విధు లకు అనుమతించాలని కోరారు.



## దేవాదాయ సిబ్బందిపై నవులూరి రాజేష్ దౌర్జన్యం

### పోలీసులకు పిర్యాదు చేసిన ఆలయ అధికారి

**వలేటివారిపాలెం జూన్ 23, ప్రభాతవార్త** మండలంలోని శాఖవరంలో పలువురు గ్రామస్తులు విధినిర్వ హణలో ఉన్న ప్రభుత్వ సిబ్బందిపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారు.దీంతో శాఖవరంలో పనిచేయాలంటే తమకు ఇబ్బందిగా ఉందని వాపోతున్నారు.అదేమంటే ప్రభుత్వము తమదని,తాము చెప్పినట్లే సిబ్బంది నడుచు కోవాలని హుకుం జారీచేస్తున్నారని ఉద్యోగులు వాపోతున్నారు.తమకు రక్షణ కల్పించాలలని వారు పోలీసులతో పాటు అధికారులకు పిర్యాదుచేస్తున్నారు.ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చొరవతీసుకొని నిజానిజాలు విచారించి తగిన చర్యలు తీసుకోక పోతే ప్రభుత్వంకు పాలకులకు చెడ్డపేరు వస్తుందని పలువురు తెదేపా నాయకులు సూచిస్తున్నారు.

**వివరాల్లోకి వెళ్తే...** గ్రామంలో శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంకు చెందిన 56.09 ఎకరాల భూమి బహిరంగ వేలంపాటల ఈ నెల 21న శాఖవరంలో బహిరంగ వేలం వేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి గ్రామస్తులకు గొడవ జరిగింది.దీంతో ఆలయ అధికారి పి.కార్తీక్ మరియు జూనియర్ అసిస్టెంటు సిహెచ్. పావనిలు వేరువేరుగా వలేటివారిపాలెం పోలీసులకు పిర్యాదు చేశారు.నవులూరి వెంకయ్య కుమారుడు రాజేష్ అను వ్యక్తి అక్రమంగా వేలంపాటల నిర్వహణా ప్రాంతంలో ప్రవేశించి పాటలు ఆపమంటూ దౌర్జన్యం చేశారని,మహిళ అనే గౌరవం కూడా లేకుండా తనను హేళనగా నానారకాలుగా దుర్భాషలాడారాని పేర్కొన్నారు. తనపై చేయిచేసుకోబోయారని వివరించారు.అభ్యకరంగా దూషించాడని పావని వాపోయింది .అదేవిధంగా ఆలయ అధికారి కార్తీక్ తన పిర్యాదులో ప్రభుత్వ నిబంధనలు మేరకు తాను సిబ్బందితో విదులు నిర్వర్తిస్తుండగా తమ విధులకు ఆటంకం కల్గించారని, తమ సిబ్బందిపై దౌర్జన్యం చేస్తూభయ భ్రాం తులకు గురిచేశారని తన పిర్యాదులో వివరించారు.ఆయనపై కఠినచర్యలు తీసుకోవాలని వారుకోరారు.ఈ విష యమై ఇన్‌చార్జి ఎస్పై నారాయణ మాట్లాడుతూ పిర్యాదుచేసిన మాట వాస్తవమేని దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.

**వీఆర్వోపై దౌర్జన్యం:** శాఖవరం నివాసి వడ్లమూడి రామకృష్ణ అను వ్యక్తికి రేషన్‌కార్డు దరఖాస్తు విషయంలో డీలరు వడ్లమూడి వెంకటరావు దౌర్జన్యం చేశారని శాఖవరం వీఆర్వో కవితాలక్ష్మి సోమవారం ప్రభాతవార్తతో తెలిపారు.ఈ మేరకు తహసిల్దార్‌కు పోన్‌లో సమాచారం అందచేశారు.మంగళవారం సబ్‌కలెక్టర్‌కి ,పోలీసులకు పిర్యాదు చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.వివరాల్లోకి వెళితే రామకృష్ణ అనే వ్యక్తికి రేషన్‌కార్డుకి ధరఖాస్తుచేయగా రెజక్ట్ అయిందన్నారు. దీంతో వారు రెచ్చిపోయి తనే కారణమంటూ దౌర్జన్యానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. దరఖాస్తుదారుడు ఇన్‌కంటాక్స్ చెల్లింపుదారుడు అయినా కారణంగా ప్రభుత్వం అనర్హుడుగా గుర్తించినట్లు ఆమె పేర్కొన్నారు. వెంకటరావుతోపాటు పల్లపోతు దేశింగరావు, కాటా జనార్దన్‌రావు, వడ్లమూడి వెంకటేశ్వర్లు తదితరులు తనపైవాగ్వాదానికి పాల్పడ్డారని ఆమె ఆరోపించారు.




## బుచ్చి తహసిల్దారు కార్యాలయంలో స్వచ్ఛంధ్ర-స్వచ్ఛ దివాస్

**బుచ్చి జూన్ 23 ప్రభాతవార్త** మండలంలోని గ్రామాలలో కన్నా ముందు తహసిల్దారు కార్యాలయంలో స్వచంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్న తలంపుతో తహ సిల్దారు అంబటి వెంకటేశ్వర్లు రెండో సారి కార్యాలయం మొత్తం తన సిబ్బందితో కలిసి స్వచ్ఛంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యాలయం మొత్తం సిబ్బందితో కలిసి రికార్డులన్ని శుభ్రం చేసి రికార్డు గదులన్ని శుభ్రం చేయించారు. గతంలో కూడా ఆయన తహ సిల్దారుగా బాధ్యతలు చేపట్టిన రోజే తహసిల్దారు కార్యాలయం మొత్తం ఆయన పారబట్టి శుభ్రం చేశారు. మరోసారి తహసిల్దారు కార్యాలయం మొత్తం శుభ్రంగా తయారు చేశారు. అయితే తహసిల్దారు, కార్యాలయం సిబ్బంది కార్యాలయానికి రంగులు కూడా వేయిస్తే బాగుంటుంది అన్న ఆలోచనలో ఉన్నారు. ఇటువంటి వాటికి దాతలు కూడా సహకరించాలని కార్యాలయానికి వచ్చిన ప్రజలు అనడం కొసమెరుపు




## ఒక మహోన్నతమైన దేశభక్తుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి : బిజెపి నేతలు

**కావలిరూరల్, జూన్23 ప్రభాత వార్త** జాతీయసమైక్యత, దేశ ఉజ్వల భవిష్యత్తు కోసం పాటుపడిన మహానేత, భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి అని పలువురు బిజెపి నేతలు తెలిపారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి వర్ధంతి బలిదాన్ దివస్‌ని పురస్కరించుకుని భారతీయ జనతాపార్టీ పట్టణశాఖ ఆధ్వర్యంలో పట్టణ అద్యక్షులు మంద కిరణ్‌కుమార్ అద్యక్షతన సోమవారం కావలి పట్టణ బిజెపి పార్టీ కార్యాలయంలో డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి చిత్రపటానికి పూల మాలలువేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్రసహకోశాధికారి, కందుకూరి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత, కందుకూరి వెంకటసత్యనారాయణ, రాష్ట్రకార్యవర్గ సభ్యులు గుండ్లపల్లి భరత్‌కుమార్, అంచిపాక కమల, జిల్లా టెలికాం అడ్వైజరి కమిటి సభ్యుడు కుట్టుబోయిన బ్రహ్మానందం, కావలి అసెంబ్లీ కన్వీనర్ సివిసి సత్యం, తదితరులు మాట్లాడారు. జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి నడిపించిన బాటలో బిజెపి పయనిస్తుందని తెలిపారు. ఆయన జీవితం దేశప్రజలకు స్పూర్తిదాయకమన్నారు. ఆయన ఆలోచనా విధానాలు ముందుచూపుకు నిదర్శనమని తెలిపారు. దేశంలో ఒకే పౌరసత్వం, కాశ్మీర్‌లో అవరోధంగా ఉన్న ఆర్టికల్ 370 రద్దుకోసం శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి తీవ్రంగా కృషిచేశారని తెలిపారు. ఒక దేశంలో ఒకే రాజ్యాంగం, ఒకే జెండా, ఒకే విధానం, ఒకే ప్రధాని ఉండాలని బలంగా తెలిపారన్నారు. జమ్ము కాశ్మీర్ సమస్యను ముందుగా అర్థంచేసుకున్న వ్యక్తి డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి అని తెలిపారు. కాశ్మీర్‌కు ప్రత్యేక అధికారాలు, స్వయంప్రతిపత్తిని శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి తీవ్రంగా వ్యతిరేకించడం జరిగిందని తెలిపారు. ఆర్టికల్ 370ని తీసుకురావడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారన్నారు. కాశ్మీర్ సమస్యపై నిరంతరం పోరాటం చేస్తూ దానికి పరిష్కారం కోరుతూ తన గళం వినిపించారన్నారు. బెంగాల్ విభజన జరుగుతున్నపుడు భారతదేశ హక్కులు, ప్రయోజనాల కోసం విజయ వంతంగా పోరాడిన వ్యక్తి శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి అని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోడి ఇనుపసంకల్పం, అంకితభావం ఒకవైపు, కేంద్రమంత్రి అమిత్‌షా సమర్థవంతమైన వ్యూహం, ప్రణాళిక మరోవైపు ఆగస్టు 2019లో ఆర్టికల్ 370 రద్దుచేయడం జరిగిందన్నారు. ఒకదేశంలో ఒకే రాజ్యాంగం కింద భారతదేశంలో చూడాలన్న డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి కలలను ప్రధాని నరేంద్రమోడి నెరవేర్చారని తెలిపారు. జియస్‌టి మండలి సభ్యులు అమరా వెంకటసుబ్బారావు, ఎస్సీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు పరుసు వెంకటేశ్వర్లు, ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షులు పరుసు మధు, బిజెపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## బాడీ బిల్డింగ్ పోటీల్లో గెలుపొందిన ప్రేమ్ సాగర్

**అల్లూరు, జూన్ 23 ప్రభాతవార్త:** అల్లూరు వాస్తవుడైన ప్రేమ సాగర్ కావలి బృందావనం కాలనీలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో నాలుగువ స్థానం సాధించగా ఇండియన్ బాడీ బిల్డర్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ స్వామి రమేష్‌కుమార్ చేతుల మీదుగా ట్రోఫీని అందుకున్నారు. అల్లూరు వాస్తవుడైన ప్రేమ్‌సాగర్‌కు రాష్ట్ర స్థాయిలో అవార్డురావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రేమ్‌సాగర్ తండ్రి పి. కృష్ణయ్య హెల్త్ డిపార్ట్మెంట్లో సూపర్వైజర్ గా తల్లి పద్మ ఏఎన్ఎం గా పనిచేస్తున్నారు వారిని పలువురు అభినందించారు.



## జిల్లా క్రికెట్‌జట్టుకు ఎంపికైన క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే

**కావలిరూరల్, జూన్23 ప్రభాతవార్త** నెల్లూరుజిల్లా క్రికెట్‌జట్టుకు కావలి క్రికెట్ అసోసియేషన్ (కెసిఎ) నుండి 5 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను సోమవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అభినందించడం జరిగింది. అండర్ 19 విభాగానికి ఎంపికైన క్రీడాకారులు సమాధి భార్గవ్, లోకేష్‌లు ఎంపికకాగా, అండర్ 16 విభాగా నికిరిషిత్, నవీంద్ర,యశ్వంత్‌లు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి అభినందించి మాట్లాడారు. భవిష్యత్తులో క్రికెట్‌లో బాగా రాణించాలన్నారు. రాష్ట్రస్థాయిలో కావలికి మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. కావలి క్రికెట్ అసోసియేషన్ అభివృద్ధికి ఎలాంటి సహ కారమైనా అందిస్తానని ఎమ్మెల్యే దగుమాటి హామీని ఇవ్వడం జరిగింది. విద్యార్థులు చదువుతోపాటు క్రీడ లలో రాణించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కావలి క్రికెట్ అసోసియేషన్ అద్యక్షులు సిద్ధు, క్రికెట్ కోచ్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



## అర్హత కలిగిన వారికి ఇళ్ల స్థలాలు మంజూరు

**నెల్లూరు అగ్రికల్చర్, జూన్ 23, ప్రభాతవార్త** నెల్లూరులోని అర్బన్ ఎమ్మార్వో కార్యాలయంలో ప్రజా విజ్ఞప్తుల దినం సందర్భంగా తహశీల్దార్ షఫీ మాలిక్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజలు ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డుల కోసం తహశీల్దార్ కార్యాలయానికి వస్తున్నారని, సంబంధిత సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకుంటే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని అన్నారు. ప్రజా విజ్ఞప్తుల దినం సందర్భంగా తమ కార్యాలయానికి మూడు అర్జీలు వచ్చినట్లు చెప్పారు. వీటిని సంబంధిత సచివాలయాలకు పంపినట్లు వెల్లడించారు. మారుతున్న పరిపాలన విధా నాల పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అన్ని సేవలు నేడు సచివాలయాల్లో లభ్యమ వుతున్నాయని, ప్రజలు ఏ సమస్య మీద అయితే పరిష్కారం కోరుతున్నారో దానికి సంబంధించిన విజ్ఞప్తులన్నీ తాము పరిశీలించి అర్హులకు న్యాయం చేస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. తమ కార్యాలయానికి వచ్చే ప్రజలు ఎవరు కూడా ఏ పనికి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని, ఇలాంటి విధానాన్ని తాము అంగీకరించబోమన్నారు.

